ప్రజాశక్తి

సోమవారం 8 మే 2023 8 పేజీలు





ఎన్‌టిఆర్ కృష్ణా





విజయవాడ సిద్ధార్థ కళాశాల వద్ద నీట్ పరీక్షలకు వచ్చిన విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు; పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

'నీట్' తనిఖీలు

కఠినంగా నిబంధనలు

99.17 శాతం మంది హాజరు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : విజయవాడ నగరంలో ఆదివారం నీట్ -2023 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో సీట్ల భర్తీకి నిర్వహించిన నీట్‌లో విజయవాడ రీజియన్‌లో 99.17 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 24 పరీక్షా సెంటర్లలో 14,843 మంది అభ్యర్థులకుగాను 14,720 మంది పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేశారు. ఉదయం 9 గంటల నుండి పరీక్షా కేంద్రాలకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బంధువులు వచ్చారు. దీంతో పరీక్ష కేంద్రాల వద్ద కోలాహలం నెలకొంది. పరీక్షల నిర్వహణకు నిబంధనలు కఠినంగా ఉండడంతో విద్యార్థులు కొంత ఆందోళనకు గురయ్యారు. విద్యార్థులకు చేతి ఉంగరాలను కూడా కూడా అనుమతించలేదు. వాచీలు, జడ క్లిప్పులను తనిఖీ చేశారు. వాటిని కూడా లోనికి అనుమతించలేదు. వాటర్ బాటిళ్లపై ఉన్న లేబుళ్లను చించివేసి లోనికి అనుమతించారు. పరీక్షలు పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు.









మచిలీపట్నంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి రోజా, చిత్రంలో మంత్రి జోగి, ఎంఎల్‌ఎలు పేర్ని, కొడాలి తదితరులు

19, 22 తేదీల్లో సిఎం పర్యటన

గుడివాడలో టిడ్కో గృహాల పంపిణీ

మచిలీపట్నం పోర్టు పనులకు శంకుస్థాపన **జిల్లా ఇన్చార్జి మంత్రి రోజా**

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా)

కృష్ణాజిల్లాలో త్వరలో జరిగే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటనలను విజయవంతం చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన అభ్యుదయ శాఖల మంత్రి, కష్ణాజిల్లా ఇన్చార్జ్ మంత్రి ఆర్‌కె.రోజా కోరారు. మచిలీపట్నంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గహంలో ఆమె రాష్ట్ర గహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, మచిలీపట్నం, గుడివాడ శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని), కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని), శాసనమండలి సభ్యుడు తలశిల రఘురాం, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్‌పి పి.జాషువా, డిఆర్‌ఒ, ఆర్‌డిఒ తదితరులతో సమావేశమయ్యారు. అనంతరం ఆమె మచిలీపట్నం పోర్ట్ నిర్మాణ స్థలం, హెలిపాడ్, పైలాన్‌లను పరిశీలించారు. తర్వాత ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభ స్థలాలను ఎంపిక చేసేందుకు నోబుల్ కళాశాల, పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లను ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సి, వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయా కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రోజా మాట్లాడుతూ ఈనెల 19న గుడివాడలో, 22న మచిలీపట్నంలో ముఖ్యమంత్రి పర్యటిస్తారని తెలిపారు. యావత్ కష్ణాజిల్లా ప్రజల చిరకాల వాంఛను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఈనెల 22న మచిలీపట్నం పోర్టు నిర్మాణ పనుల ప్రారంభోత్సవంతో నెరవేర్చనున్నారని తెలిపారు. పోర్టు పనులకు భూమి పూజ చేయనుండడం ఓ చారిత్రాత్మక ఘట్టమని అభివర్ణించారు. దాదాపు 5 వేల కోట్లతో 17 వందల ఎకరాల్లో మొదటి దశ పోర్టు నిర్మాణ పనులు ఆరోజు నుంచే ప్రారంభమవుతాయన్నారు. అలాగే గుడివాడలో రూ.800 కోట్లతో నిర్మించిన సుమారు 9 వేల టిడ్కో గృహాలను ఈనెల 19న ముఖ్యమంత్రి పంపిణీ చేయనున్నారని తెలిపారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ కష్ణాజిల్లా అభివద్ధికి మచిలీపట్నం ఓడరేవు నిర్మాణం ఎంతో కీలకమన్నారు. కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ ఈనెల 22న పోర్టు నిర్మాణ పనులకు భూమి పూజ చేసిన అనంతరం మచిలీపట్నం పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో మచిలీపట్నం మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డిప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సిలార్ దాదా, డిఆర్‌ఒ ఎం.వెంకటేశ్వర్లు, ఆర్‌డిఒ ఐ.కిషోర్, మచిలీపట్నం తహశీల్దారు సునీల్ బాబు, మచిలీపట్నం పోర్టు ఎమ్‌డి విద్యాశంకర్, మెగా ఇంజినీరింగ్ ప్రాజెక్ట్ హెడ్ తులసీదాస్, డ్వామా పీడీ జివి.సూర్యనారాయణ, మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ చంద్రయ్య, పలువురు కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

అక్టోబర్‌నాటికి ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తి

ప్రజాశక్తితో హార్బర్ ఇఇ కె.మునిరెడ్డి





ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

మత్స్యకారులు సముద్రంలో వేట నిమిత్తం రాకపోకలు సాగించేందుకు, సరుకు ఎగుమతి దిగుమతికి ఉపకరించే మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయని ఫేజ్-1 ఫిషింగ్ హార్బర్ ఇఇ కె.మునిరెడ్డి తెలిపారు. మచిలీపట్నం నగర శివారు గిలకలదండి వద్ద సముద్రతీరంలో ఈ పనులు రూ.321.99 కోట్లతో ప్రభుత్వం చేపట్టిందని, ఇప్పటికి 75 శాతం పనులు పూర్తయ్యాయని ఫేజ్-1 ఫిషింగ్ హార్బర్ ఇఇ కె.మునిరెడ్డి తెలిపారు. వచ్చే అక్టోబరు నాటికి ఫిషింగ్ హార్బర్ సిద్ధమవుతుందన్నారు. జాతీయ రహదారులు ఎన్ హెచ్-216, ఎన్‌హెచ్-65 లకు 8 కిలో మీటర్లు తూర్పున ప్రతిపాదించిన బందరు పోర్టుకు 5 కిలో మీటర్లు దక్షిణాన హార్బర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. హార్బర్ పనులపై ఆయన ప్రజాశక్తికి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. హార్బర్ నిర్మాణం గురించి ఆయన మాటల్లోనే...

ప్రశ్న : ఒప్పందం ప్రకారం నిర్మాణ సంస్థ షిప్పింగ్ హార్బర్ నిర్మాణ పనులు చేస్తోందా ?

రాష్ట్రంలో మొత్తం 9 ఫిషింగ్ హార్బర్లను ప్రభుత్వం నిర్మిస్తోంది. (మిగతా 6లో)



మేడే వారోత్సవాల్లో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డివి.కృష్ణ

కార్మికులకు అండ సిఐటియు జెండా

మేడే వారోత్సవాల్లో సిఐటియు జిల్లా నేత డి.వి.కృష్ణ

ఊర్మిళానగర్లో అలరించిన సాంస్కృతిక సంబరాలు

ప్రజాశక్తి - భవానీపురం : "కార్మికులకు అండ సిఐటియు జెండా" అని సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ఉపాధ్యక్షులు డి.వి.కృష్ణ అన్నారు. సిఐటియు పశ్చిమ సిటీ కమిటీ ఆధ్వర్యాన 137వ మేడే వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉత్సాహంగా సాంస్కృతిక సంబరాలు నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక ప్రాంతమైన ఊర్మిళానగర్‌లో జరిగిన ఈ సంబరాల్లో అంగన్వాడీలు, ఆశాలు, మున్సిపల్, ముఠా కార్మికుల పిల్లలు, కార్మికుల పిల్లలు ప్రదర్శించిన కళారూపాలు అలరించారు. ఏకపాత్రాభినయం, దేశభక్తి గీతాలు, కార్మిక పోరాట గీతాలు, అభ్యుదయ గీతాలు, నాటికలు ప్రదర్శించారు. ఈకార్యక్రమాల్లో స్థానికులు పెద్దఎత్తున పాల్గొనటంతో ఆ ప్రాంతంలో కోలాహలం నెలకొంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డి.వి.కష్ణ మాట్లాడుతూ ప్రభుత్వాలే కార్మికుల హక్కులను హరిస్తున్నాయని విమర్శించారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మికుల హక్కులను, చట్టాలను నేడు కేంద్రంలోని బిజెపి మోడీ, రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని మండిపడ్డారు. ఈనేపథ్యంలో కార్మికుల హక్కులను కాపాడుకునేందుకు మేడే స్ఫూర్తితో ఉద్యమాలను ఉధృతంగా సాగించాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులంతా కలిసికట్టుగా ఉండాలని, వారికి సిఐటియు అండగా ఉంటుందని అన్నారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తమ ప్రతిభను కనబర్చిన అన్ని రంగాలకు చెందిన కార్మికులను, (మిగతా 6లో)



సాంస్కృతిక ప్రదర్శనలో మహిళలు

నేడు లక్ష్మయ్య వాగుపై బ్రిడ్జికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల మండలం చెవిటికల్లు గ్రామం వద్ద లక్ష్మయ్య వాగు పై బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం కలగడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వాగు పై బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు 2 దశాబ్దాలుగా పాలకులకు విన్నవించుకుంటున్నారు. అయితే ప్రభుత్వాలు, పాలకులు మారారేగాని, ఈ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు కాలేదు. దీంతో వర్షాకాలం వచ్చిందంటే వాగు ప్రవాహం గురించి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రతి ఏటా జులై నెల నుండి నవంబర్ నెల వరకు వర్షాకాలంలో వర్షం కురిస్తే చుట్టుపక్కల పొలాల నుండి వర్షం నీరు వాగుపై ప్రవహిస్తుంది. భారీ ప్రవాహం వచ్చినప్పుడు వాగుపై 5 నుండి 6 అడుగుల మేర ప్రవహిస్తోంది. ఒక్కో సారి కష్ణా నది వరద ప్రవాహం పెరగటంతో లక్ష్మయ్య వాగు కు వరద ప్రవాహం పోటెత్తుతుంది. 2009 లో కష్ణానది కో వచ్చిన భారీ వరదలకు లక్ష్మయ్య వాగు పోటెత్తి చుట్టుపక్కల పంట పొలాలు, చుట్టేసింది. రెండు రోజుల పాటు చెవిటికల్లు గ్రామానికి రాక పోకలు నిలిచిపోయాయి. అప్పట్లో ఈ వాగును పరిశీలించిన అప్పటి రోడ్లు భవనాలు శాఖ మంత్రి గల్లా అరుణకుమారి లక్ష్మయ్య వాగు పై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చి ఎస్టిమేట్ తయారు చేశారు. తర్వాత ఆ ప్రభుత్వం కాని, 2014 లో అధికారం లోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం కాని పట్టించుకోలేదు. అప్పటి నుండి చిన్నపాటి వర్షం కురిసినా లక్ష్మయ్య వాగు కు వరద చేరి రాకపోకలు నిలిచిపోతునే ఉన్నాయి. ఈ వాగు పై బ్రిడ్జి నిర్మాణం ఎప్పటికీ నోచుకోదని ప్రజలు అసంతప్తి తో ఉన్నారు. ఇదిలాఉండగ 2020 లో ఈ బ్రిడ్జి పై కేవలం 4 అడుగుల మేర నీరు వరద ప్రవాహం వచ్చినప్పుడు చెవిటి కల్లుకు చెందిన చిన్నారి నీటి ప్రవాహం లో తోటి వారితో కలిసి దాటుతుండగా వరద ప్రవాహానికి నీటిలో గల్లంతై మతి చెందింది. ఆ సమయంలో గ్రామస్థులు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆందోళన చేస్తూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ సమయంలో జలవనరుల శాఖ మంత్రి పి అనీల్ కుమార్, జిల్లా కు చెందిన మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని, వాగు ప్రవాహాన్ని పరిశీలించి బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ లు లక్ష్మయ్య వాగు పై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కోసం ముఖ్యమంత్రి దష్టికి పలుమార్లు తీసుకువెళ్లారు. నిధులు మంజూరుకు



మంత్రులు, అధికారుల చుట్టూ తిరిగారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ కషి మేరకు లక్ష్మయ్య వాగు పై బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం 1.60 కోట్లు నిధులు మంజూరు చేసింది. టెండర్లు కూడా వేశారు. దీంతో ఈ నెల 8 వ తేదీన సోమవారం నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ లక్ష్మయ్య వాగు పై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని కంచికచర్ల వైస్ ఎంపిపి బండి మల్లిఖార్జన రావు, చెవిటికల్లు గ్రామ సర్పంచ్ బుడ్డి విజయలక్ష్మి ఆదివారం తెలిపారు. బ్రిడ్జి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి గ్రామస్థుల ఇబ్బందులు తొలగించాలనే తలుంపుతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ బ్రిడ్జి నిర్మాణం పనులు పర్యవేక్షిస్తారని వారు తెలిపారు. లక్ష్మయ్య వాగు పై బ్రిడ్జి నిర్మాణానికి నోచుకోవటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విజ్ఞాన్ విద్యార్థులకు ఉదయభాను అభినందన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పదో తరగతి పరీక్షా ఫలితాలలో పట్టణంలో విజ్ఞాన్ హై స్కూల్ కు చెందిన విద్యార్థి తోకల హర్షిత 584 మార్కులు, బండ్ల నిఖిత 584 మార్కులతో స్కూల్ ఫస్ట్ కైవసం చేసుకున్నారు. గురుగుబెల్లి జస్విత 580 మార్కులు, చేకూరి కవిత 580 మార్కులు, గుగులోతు తాన్యానాయక్ 580 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, కష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఛైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు మొమెంటో, శాలువాలతో అభినందించారు. విజ్ఞాన్ స్కూల్ లో 550 పైగా మార్కులు సాధించినవారు 16 మంది ఉండగా, 500 పైగా మార్కులు సాధించినవారు 36 మంది ఉన్నారు.



ప్రతిభ చాటిన విద్యార్థులు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పది ఫలితాల్లో మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామానికి ముల్లంగి అక్షిత 560 మార్కులు, ముంగి మౌనిక 550 మార్కులు, యలమందల సుధీర్ 546 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచినందుకు ఆ విద్యార్థులను టిడిపి జాతీయ కోశాధికారి, నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ శ్రీరాం రాజగోపాల్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కట్టా వెంకట నరసింహారావు, ముల్లంగి రామకష్ణారెడ్డి, షేక్ సుభాని, షేక్ బాషా, షేక్ బడేమియా, షేక్ నాగుల్ మిరా, పల్లెబోయిన బ్రహ్మం, మెట్టెల రమణ, వాసురెడ్డి, ఆయిలపోగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




శ్రీ చైతన్య స్కూల్ విజయభేరి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా శ్రీ చైతన్య పాఠశాల అత్యధిక మార్కులు 597 మార్కులు సాధించినట్లు చైతన్య స్కూల్ ప్రిన్సిపాల్ కే లావణ్య, డీన్ వి.కష్ణ తెలిపారు. జగ్గయ్యపేట బ్రాంచ్ తమ పాఠశాలలో ఎం మని మేఘన 600 మార్కులు గాను 585 మార్కులు, షేక్ షేక్ అన్వర్ 582 మార్కులు, జి మధు శ్రీ 5 82 మార్కులు, ఎన్ దీక్షిత 540 మార్కులు సాధించారని, 500 అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన వారు 24 మంది విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులను ఈజీఎమ్ మురళీకష్ణ, ఆర్ ఐ వినోద్ కుమార్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అభినందించారు.



తిరుపతమ్మను దర్శించుకున్న ఎంపి జయదేవ్

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు:: స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని గుంటూరు ఎంపి గల్లా జయదేవ్ కుటుంబసమేతంగా ఆదివారం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమర్ రాజా గ్రూప్స్ వ్యవస్థాపకుడు ఆయన తండ్రి రామచంద్రానాయుడు అమ్మవారి మొక్కుబడులు తీర్చుకొనే నిమిత్తంలో భాగంగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజలు అనంతరం ఆలయ ఛైర్మన్ చెన్న కేశవరావు సత్కరించారు. అనంతరం పాత సినిమా హాల్ సెంటర్ నందు గల నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ ఛైర్మెన్లు నూతలపాటి చెన్నకేశవరావు, కర్ల వెంకట నారాయణ, మండల అధ్యక్షులు చింతల సీతారామయ్య, మాజీ ఎంపీపీ గోపాలకష్ణమూర్తి, అమర్ రాజా గ్రూప్స్ ప్రతినిధి వీరేంద్ర, చుంచు రమేష్‌బాబు, నల్లపునేని కొండ పాల్గొన్నారు.



గంపలగూడెంలో 71 శాతం మంది ఉత్తీర్ణత



శ్రీవర్షిత



రామాంజన



నవీన్

ప్రజాశక్తి-గంపలగూడెం: శనివారం విడుదలైన పదవ తరగతి పరీక్షల్లో గంపలగూడెం మండలం 71 శాతం ఉత్తీర్ణత సాధించింది. మండలంలో 11 ప్రభుత్వ 8 ప్రైవేటు పాఠశాలల నుండి 832 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 587 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఊటుకూరు సిద్ధార్థ నుండి రామిశెట్టి శ్రీ వర్షిత 591, కేరళ హై స్కూల్ ఊటుకూరు నుండి అజ్జారపు రామాంజన 579, శ్రీ గాయత్రి తోటమూల నుండి జి.నవీన్ 578 మార్కులు సాధించారు. నెమలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి 51 మంది పరీక్షలకు హాజరు కాగా 38 మంది ఉత్తీర్ణతతో 71 శాతం సాధించింది. ఊటుకూరు జడ్పీహెచ్ఎస్ 65 కు గాను 35 మంది ఉత్తీర్ణత సాధించగా 45 శాతం వచ్చింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్లపాడు 44కి 17 మంది ఉత్తీర్ణులవగా 39 శాతం వచ్చింది. సత్యాలపాడు జడ్పీహెచ్ఎస్ నుండి 45 మందికి 30 మంది ఉత్తీర్ణులవగా 67 శాతం సాధించింది. పేనుగొలను జడ్పీహెచ్ఎస్ 47 మందికి 33 మంది పాసై 70 శాతం వచ్చింది. గంపలగూడెం 106 మందికి 42 మంది ఉత్తీర్ణులవగా 40 శాతంతో సరిపెట్టుకుంది. కనుమూరు జిల్లా పరిషత్ నుండి 33 మంది హాజరు కాగా 30 మంది ఉత్తీర్ణులై 71 శాతం సాధించింది. తునికిపాడు 32 మందికి 15 మంది పాసవ్వగా 47 శాతం వచ్చింది. కేజీబీవీ 39 మందకి 30 మంది ఉత్తీర్ణులు కాగా 77 శాతం వచ్చింది. ఏపీ మోడల్ స్కూల్ 93 మందికి 80 మంది పాసై 66 శాతం వచ్చింది. ఏబీఎం అమ్మిరెడ్డిగూడెం 9 మందికి 5 మంది పాసై 56 శాతం వచ్చింది. ప్రైవేట్ పాఠశాలలైన సిద్ధార్థ ఊటుకూరు నుండి 44 మంది రాయగ 41 మంది పాసై 93 శాతం వచ్చింది. కేరళ ఊటుకూరు నుండి 10 మంది హాజరు కాగా7 మంది ఉత్తీర్ణులై 70 శాతం సాధించింది. వివేకానంద గుల్లపూడి 33 కి గాను 30 మంది ఉత్తీర్ణతతో 91 శాతం సాధించింది. సాజోస్ తోట మూల నుండి 9 మందికి గాను 9 మంది పాసై 100 శాతం వచ్చింది. శ్రీ సరస్వతి తోట మూల 35 కి 35 మంది పాసై 100 శాతం వచ్చింది. లిటిల్ ఏంజిల్స్ గంపలగూడెం 53 కి 50 మంది ఉత్తీర్ణులు కాగా, 94 శాతం తెచ్చుకుంది. విజ్ఞాన్ విద్యాలయం 4కి గాను 3 మంది పాసై 75 శాతం వచ్చింది. శ్రీ గాయత్రి 60 మందికి గాను 57 మంది ఉత్తీర్ణులై 95 శాతం సాధించినట్లు గంపలగూడెం మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు.



తడిసిన పంటలను ప్రభుత్వమే కొనాలి : టిడిపి

ప్రజాశక్తి-నందిగామ: ఇటీవల కషి రకాల వర్షాల వల్ల తడిసి దెబ్బతిన్న పత్తి, మిర్చి, మొక్కజొన్న, ధాన్యం, పసుపు పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ డిమాండ్ చేశారు. మండలంలోని మాగల్లు గ్రామంలో ఆదివారం తడిసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో చేతికొచ్చిన పంట నష్టపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పంట నష్టం అంచనా వేసి త్వరగా పరిహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీరంకి వీరస్వామి, తోట నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

బైక్ పల్టీ అయి తండ్రి మతిచెందగా కుమారుడుకి గాయాలైన సంఘటన చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని అనుమంచిపల్లి గ్రామ సమీపంలోని 65 వ నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగింది. సేకరించి సమాచారం మేరకు షేర్ మహమ్మద్ పేట గ్రామానికి చెందిన పూల వ్యాపారి షేక్ నాగుల మీరా (36) తన కుమారుడు బాజీ బాబా తో కలిసి కోదాడ నుండి స్వగ్రామం షేర్ మహమ్మద్ పేట బైక్ పై వస్తుండగా అనుమంచిపల్లి గ్రామ సమీపంలోని బైక్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రక్కనగల ఐరన్ రాడ్డుకు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నాగుల మీరా అక్కడికక్కడే మతిచెందాడు. కుమారుడు బాజీ బాబా తలకు, కాళ్లకు గాయాలు కాగా, దవడ విరిగిపోయింది. గాయపడ్డ క్షతగాత్రుడను విజయవాడకు తరలించి చికిత్స చేయిస్తున్నారు. నాగుల మీరా మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మతునికి భార్య, ఇద్దరు పిల్లలు కలరు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రెల అక్రమ రవాణా

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని ప్రతి శుక్రవారం శనివారం జరిగే మార్కెట్ సంతలో చనిపోయిన గొర్రెలను మేకలను తీసుకొచ్చి విక్రయిస్తుండడం వల్ల ప్రజారోగ్యం కుంటుపడుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి శనివారం నాడు నందిగామ వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో మార్కెట్ సంత నిర్వహిస్తున్నారు. ఈ సంతకు ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో గొర్రెలు మేకలు తీసుకువచ్చి క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. అయితే సందట్లో సడే మీయ అన్నట్టుగా చనిపోయిన గొర్రెలను కూడా తీసుకువచ్చి అమ్మకాలు సాగించడం వల్ల ప్రజలు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. నందిగామ వ్యవసాయ మార్కెట్ యాడ్ పరిధిలోని కొంతమంది దళారులు సిండికేట్ ఏర్పడి గుట్టు చప్పుడు కాకుండా చనిపోయిన గొర్రెలను కొనుగోలు చేసి రాజమండ్రి, పశ్చిమగోదావరి , కాకినాడ, శ్రీకాకుళం, వైజాగ్ జిల్లాలకు అడ్డగోలుగా తరలిస్తున్నారు. శనివారం కొనుగోలు చేసిన చనిపోయిన గొర్రెలను ప్రతి మంగళ బుధవారాల్లో నందిగామ బైపాస్ రోడ్డు అంబర్పేట క్రాస్ వద్ద లారీలకు తరలిస్తున్నారు. రోగాలు వచ్చిన గొర్రెలను కూడా మేకలను కూడా మాంసం విక్రయదారులు అడ్డగోలుగా అక్రమ రవాణా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. నందిగామ పట్టణంలో కొంతమంది మటన్ క్రయవిక్రయదారులు చనిపోయిన గొర్రెలను సైతం కొనుగోలు చేసి ప్రజలకు రోగాలు వచ్చిన గొర్రెలను మేక మాంసమును ప్రజలకు అమ్మి అనారోగ్యాన్ని



కూడబెడుతున్నారు. అమాయక ప్రజలు కల్తీ కల్తీ మటన్ మాంసం తిని రోగాలు బారిన పడి వేలాది రూపాయలు ఆస్పత్తులు చెల్లించి ఆర్థికంగా మానసికంగా శారీరకంగా నష్టపోతున్నారు. నందిగామ పట్టణంలో కల్తీ మటన్ మాఫియా యదేచ్ఛగా సాగుతున్న సానిటరీ ఫుడ్ ఇన్స్పెక్టర్లు కనీసం తొంగి చూడటం లేదు . మటన్ మాఫియా వారి వద్ద వారానికి ఒకసారి మామూలు తీసుకుంటూ అధికారులు జేబులు నింపుకుంటున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. శనివారం నందిగామ పట్టణంలోని మార్కెట్ కమిటీ సంతలో చనిపోయిన గొర్రెలను నందిగా మున్సిపల్ అధికారులు సిబ్బంది గుర్తించి వాటి కళేబరాలను ఊరు బయటకు తీసుకువెళ్లి తగలబెట్టడం జరిగింది . ఇప్పటికైనా అధికారులు మానవతా దక్పథంతో స్పందించి వ్యవసాయ మార్కెట్ కమిటీ సంతలో చనిపోయిన గొర్రెలను క్రయవిక్రయాలు జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : బుద్ధప్రసాద్



ప్రజాశక్తి-మోపిదేవి : అకాల వర్షాలు కారణంగా పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, ఆఫ్ లైన్ ద్వారా మిల్లులకు ధాన్యం తోలిన రైతులకు ఆన్లైన్ చేయాలని ఈ విషయమై సోమవారం ఉదయం లోపు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకుంటే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం మోపిదేవి మండలంలోని చిరువోలు, చిరువోల్లంక, కోసూరువారి పాలెం, నాగాయ్యతిప్ప, వార్పు ప్రాంతాల్లో అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న మెట్ట పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా చిరువోలు గ్రామానికి చెందిన పలువురు రైతులు తాము పండించిన 100 ఎకరాలకు పైగా మొక్కజొన్న పంట సరిగ్గా కోతల సమయంలో కురిసిన అకాల వర్షాల కారణంగా దెబ్బతిందని ఎకరా ఒక ఇంటికి రూ.30,000 పైగా ఖర్చు చేసిన తమకు నేడు కనీసం కోత ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు బుద్ధప్రసాద్ వద్ద కన్నీరు మున్నీరయ్యారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ రైతులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ రైతుల పక్షాన ఉంటుందని, తడిచి దెబ్బతిన్న మొక్కజొన్న పంట మొత్తాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసేలా ఒత్తిడి తీసుకొస్తామని రైతులకు హామీ ఇచ్చారు. అనంతరం చిరువోల్లంక, కోసూరువారి పాలెం, నాగయతిప్ప గ్రామాల్లోని మెట్ట పంటలను పరిశీలించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ గ్రామాలకు చెందిన బజ్జి మిర్చి రైతులు నేడు తాము కేజీ ఒక ఇంటికి రూ.5 కూడా దక్కడం లేదని, బస్తా కాయలు కోసేందుకు రూ.330లు ఖర్చు అవుతుంటే బస్తా అమితే కనీసం రూ.180 నుంచి రూ.200 వరకు కూడా రావాడం లేదని వాపోయారు. అనంతరం వార్పు వద్ద వర్షాల కారణంగా దెబ్బతిన్న పసుపు పంటను బుద్ధప్రసాద్ పరిశీలించారు. వార్పు, కొక్కిలిగడ్డ, బొబ్బర్లంక, కే కొత్తపాలెం ప్రాంతాలలోని పసుపు పంట వర్షాలకు పూర్తిగా పాడైపోయిందని, వారిని ఆదుకోవాలని బుద్ధప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయన వెంట పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ కొడాలి నాని

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని కవుతరం ప్రాథమిక వ్యవసాయ సహకారపతి సంఘం, కానూరి వారి స్వ ధర్మదాని సమస్త వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సంయుక్త సౌజన్యంతో కవుతరం కానూరి వారి కళ్యాణ మండపంలో ఆదివారం ఉచిత మెగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు, కెడిసిసి బ్యాంకు చైర్మన్ తన్నేరు నాగేశ్వరరావులు ప్రారంభించారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి రాష్ట్ర నాయకులు దుక్కిపాటి శశి భూషణ, గుడివాడ ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ పావేటి చంటి, కొండలమ్మ దేవసాన చైర్మన్ శేషం గోపి, డైరెక్టర్ బాడిగ నాని తదితరులు పాల్గొన్నారు,

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గుడివాడ : గుడ్లవల్లేరు మండలంలో రూ. 47లక్షలతో నిర్వహిస్తున్న పలు అభివద్ధి పనులను ఆదివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మండలంలోని అంగ లూరులో 29.75లక్షల వ్యయంతో పిఎసిఎస్ భవనం, 150 మెట్రిక్ టన్నుల గౌడౌన్ నిర్మాణానికి, 17.35 లక్షలతో వెనుతురుమిల్లు గ్రామంలో నిర్మించిన ఏసిఎస్ భవనంలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైతాంగానికి మేలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలను రైతన్నలు సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఈనెల 19వ తేదీన గుడివాడలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటన రోజు గుడివాడలో పెద్ద ఎత్తున అభివద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్ర ˆమంలో కెడిసిసి బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, అంగలూరు పిఏసిఎస్ చైర్మన్ దుగ్గిరాల శేషుబాబు, వెనుతురుమిల్లి చైర్మన్ చందన నాగన్ననాయుడు, బ్యాంకు డైరెక్టర్ పడమటి సుజాత, రాష్ట్ర నాయకులు దుక్కిపాటి భూషణ్, నాయకులు పాలేటి చంటి, మెరుగుమాల కాళీ, మండలంలోని వైఎస్ఆర్సిపి నాయకులు, సహకార శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

విద్యార్థిని చదువుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్ సిఎస్) ఆధ్వర్యంలో మాదిరెడ్డి జగన్నాథరావు మెమోరియల్ ట్రస్టు తరుపున మాదిరెడ్డి జగదీష్ చదువుల కొరకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న ఫిసియోథెరపీ విద్యార్థిని సిహెచ్ కీర్తనకు చేయూతను అందించారు. బీఎస్సి ఫిసియోథెరపీ నాల్గవ సంవత్సరం చదువుతున్న కీర్తనకు రూ 20 వేలు ఆర్థిక సాయం చేశారు. ఐఆర్ సిఎస్ జిల్లా చైర్మన్ టి ఎస్ ఎస్ బాలాజీ, ట్రేజరర్ కె రామ్‌బాలాజీ, బ్లడ్ బ్యాంక్ డాక్టర్ డి. హనుమంతయ్య, ట్రస్ట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్న నాయిని లక్ష్మణ గాంధీ సమక్షంలో చెక్ పంపిణీ చేశారు.





నాటిక పోటీలను ప్రారంభిస్తున్న కొడాలి నాని

కళారంగంలో గుడివాడ ఖ్యాతి కొనసాగించేలా కృషి చేయాలి

ప్రజాశక్తి-గుడివాడ : స్థానికి ఎస్‌పిఎస్ ఉన్నత పాఠశాలలో కష్ణా ఆర్ట్ కల్చరల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి నాటిక పోటీలను ఆదివారం కెడిసిసి బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావుతో కలసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) ప్రారంభించారు. ఈ సందర్భంగా కొడాలి నాని మాట్లాడుతూ కలలకు పుట్టినిల్లయిన గుడివాడలో కళాకారులను ప్రోత్స హించేలా, జాతీయస్థాయి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కళారంగంలో గుడివాడకు ఎంతో ప్రత్యేక స్థానం ఉందని, ఆ ఖ్యాతిని కొనసాగేలా సాంస్కతిక సంస్థలు కషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను, కష్ణా ఆర్ట్ కల్చరల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.సత్యానా రాయణ, సమన్వయకర్త ఆర్.వి.ఎల్ నరసింహారావు, పలు సాంస్కతిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఫొటోగ్రాఫర్ల వినతి

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం డివిజన్ ఫోటోగ్రాఫర్ల వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతనంగా ఏర్పడిన కార్యవర్గం ఆదివారం మాజీ మంత్రి పేర్ని నానిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఫోటోగ్రాఫర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై నానికి వివరించి, ఫోటోగ్రాఫర్లకు సంబంధించి ఒక భవనం కోసం స్థలం, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు చిలంకుర్తి నాగభూషణం,కార్యదర్శి వంకా అనంత్ ,కార్యవర్గ సభ్యులు నాగబాబు, హరి, బాబి, సాయి ఫణి, శ్రీనివాస్, స్వామి, వాసు, శేషు, సత్యనారాయణ పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. సుమారు 25 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని అమ్మవారికి పాల పొంగళ్ళు సమర్పించి వారి యొక్క మొక్కుబడులను తీచ్చుకున్నారు. విచ్చేసిన భక్తులకు ఏ విధమైన అ సౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి చైర్మన్ శేషం గోపి, ధర్మకర్తల మండలి సభ్యులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - గుడివాడ/నందివాడ : మండలంలోని జొన్నపాడు గ్రామంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పి. శిరీష తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం మండలంలోని జొన్నపాడు గ్రామంలో పేకాట నిర్వహిస్తున్నారన్న పక్క సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి వెళ్లి పట్టుకున్నామన్నారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 1730 రూపాయలు స్వాధీనం చేసుకున్నామన్నారు. మండలంలో ఎక్కడైన పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-పెదపారుపూడి : మండలంలోని వెంట్రప్రగడ గ్రామ శివారు పులవర్తిగూడెంలో పులవర్తి విజయకుమారి భర్త అనారోగ్యంతో రెండు సంవత్సరముల క్రితం చనిపోగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో టిడిపి శ్రేణులు, ఆ పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజా దష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన కుమార్ రాజా ఆ పార్టీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి ఆధ్వర్యంలో కొంతమేర ఆర్థిక సహాయం ఆదివారం అందించారు. రెండు సంవత్సరముల క్రితం ప్రభుత్వం నుండి రెండు లక్షల రూపాయలు ఆర్థిక సాయం మతుని కుటుంబానికి అందిస్తామని, మట్టి ఖర్చు నిమిత్తం ఐదు వేల రూపాయలు అందిస్తామని ప్రభుత్వ అధికారులు హామీ ఇచ్చారని ఇంతవరకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి రాలేదని బాధితురాలు వివరించినట్లు రమేష్ తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు స్పందించి ఈ పేద కుటుంబాన్ని ఆదుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సజ్జ శివకుమార్, గుండపనేని శ్రీనివాసరావు, బుడ్డాలు, దగాని లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎ వ్యాఖ్యలపై బుద్ధప్రసాద్ ఆగ్రహం

ప్రజాశక్తి-అవనిగడ్డ : పచ్చకామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనిపిస్తుందని అలాగే క్రిమినల్ మెంటాలిటీ ఉన్న వ్యక్తులకు ప్రతి ఒక్కరూ క్రిమినల్ గానే కనిపిస్తారని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆదివారం ఆయన కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు శనివారం తనపై చేసిన వ్యాఖ్యలపై బుద్ధ ప్రసాద్ స్పందించారు. రైతులు సమస్యల్లో ఉన్నప్పుడు ఆ సమస్యలు పక్కదో పట్టించడం ఎమ్మెల్యేకు అలవాటుగా మారిపోయిందని అన్నారు. అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న రైతుల సమస్యలను తాము లేవనెత్తుతుంటే వాటికి సమాధానం చెప్పలేక ఆ సమస్యలు పక్కదారి పట్టించేలా తనపై ఎమ్మెల్యే పిచ్చిపిచ్చి వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. సమస్యలను పక్కదారి పట్టించడం మాని ఆఫ్లైన్ సమస్యతో ఇబ్బంది పడుతున్న రైతుల సమస్యలు పరిష్కరించాలని, నియోజకవర్గంలోని పంట నష్టం గురించి ముఖ్యమంత్రికి సమాచారం ఇచ్చి వారికి నష్టపరిహారం అందేల చూస్తే బాగుంటుందని ఎమ్మెల్యేకు హితువు పలికారు.

కొడాలి నానిని కలిసిన నూతన డిఎస్‌పి

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ సబ్ డివిజన్ పోలీస్ అధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పి. శ్రీకాంత్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)ను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. గుడివాడ సబ్ డివిజన్ పరిస్థితులపై ఎమ్మెల్యే కొడాలి నాని, డీఎస్‌పి శ్రీకాంత్ కొద్దిసేపు చర్చించారు.



దేవిపవిత్రలో బ్రైడల్ విభాగం ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: నగరంలోని జైహింద్ కాంప్లెక్స్‌లో దేవిపవిత్ర గోల్డ్ అండ్ డైమాండ్స్ షోరూంలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్రెయిడల్ విభాగాన్ని ఆదివారం సినీ నటి హనీ రోజ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చూడగానే ఆకట్టుకునే కలెక్షన్స్‌ని మహిళల కోసం ఏర్పాటు చేసిన దేవి పవిత్ర షోరూం అధినేతలు వి.సుధాకర్, కె.రాజేష్, వి.జగదీశ్, బ్రహ్మేంద్ర, నాగరాజు, మురలీలకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. షోరూంలో ఉన్న బ్రెయిడల్ కలెక్షన్స్ చాలా అద్భుతంగా ఉన్నాయనీ వెల్లడించారు. షోరూం అధినేత రాజేష్ మాట్లాడుతూ తమ కస్టమర్లకు ఎప్పటికప్పుడు నూతన మోడల్స్, నాణ్యత, మన్నికతో బంగారు, వజ్ర ఆభరణాలను అందిస్తున్నామని వివరించారు. వివాహాది శుభకార్యాల కోసం బంగారు వజ్రాభరణాలు కొనుగోలు చేసే వారికి సమయం కలిసి వచ్చేలా ప్రత్యేక బ్రైడల్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తమ వద్ద రాజసం ఉట్టిపడే విక్టోరియన్ కలెక్షన్స్ తో పాటు పోల్కి డైమండ్స్, నగిషీ, కుందన బ్రైడల్ జ్యుయలరీ అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని విజయవాడ పరిసర ప్రాంత ప్రజల సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

11 వరకు వేసవి శిబిరం

ప్రజాశక్తి-మైలవరం: ఈనెల 8వ తేదీ నుండి జూన్ 11వ తేదీ వరకు స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ సయ్యద్ అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.10 నుండి 15 సంవత్సరాల వయసుగల 6 నుండి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులు పోటీలకు అర్హులన్నారు. ఈ శిబిరంలో కథలు వినుట, పుస్తక పఠనం, పుస్తక సమీక్షలు,కథలు చెప్పుట, చిత్రలేఖనము, పేపర్ ఆర్ట్, థియేటర్ సజనాత్మక, కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. విద్యార్థిని,విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎవిఆర్‌పిఎం విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-నందిగామ: యన్టీఆర్ జిల్లా నందిగామ లో గల ఏవి.ఆర్.పి.యమ్.స్కూల్ విద్యార్థిని విద్యార్థుల ప్రభంజనం సష్టించారు. నందిగామ పట్టణానికి చెందిన పబ్బతి ఇషాంత్ అర్జున్ 588 మార్కులతో టౌన్ ఫస్ట్ గా నిలిచాడని సెక్రెటరీ పూర్ణేష్ తెలియజేశారు . అదేవిధంగా 582 మార్కులతో కొత్త యశశ్వి సెకండ్ ర్యాంకు సాధించగా నకిరికంటి నాగ నారాయణ నికిత 580 మార్కుల తో మూడవ ర్యాంకు సాధించిదుకు సంతోషంగా ఉందని తెలియజేశారు. 39 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని తెలియజేయుటకు సంతోషంగా ఉందని అన్నారు. విద్యార్థులను ఛైర్మన్ వి.సత్యన్నారాయణ మూర్తి, సెక్రటరీ వి.వి.ఎల్.యన్.పూర్ణేష్ , ప్రిన్సిపాల్ ఏ.దుర్గాభవాని అభినందించారు.



తోటమూలలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గంపలగూడెం: కలెక్టర్ గ్రామగ్రామాన పారిశుధ్య పనులు పూర్తిచేయాలని వచ్చిన ఆదేశాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామాల్లో లలో మురికి కాలువలు, పూడికతీత, అపరిశుభ్రతను తొలగించుట, పెంటకుప్పలు, చెత్తాచెదారం లేకుండా క్లీన్ అండ్ గ్రీన్ గా ఉండాలని ఆదేశించారు. ఇందులో భాగంగా ఆదివారం తోలటమూల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట పేరుకుపోయిన మురికిని జెసిబితో తొలగించే కార్యక్రమం చేపట్టారు.



సిఐటియు గ్రామీణ శ్రామికుల సర్వే

ప్రజాశక్తి-నందిగామ: రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ శ్రామికుల సర్వేలో భాగంగా ఆదివారం చందర్లపాడు మండలం కొనయపాలెంలో సిఐటియు ఆధ్వర్యంలో గ్రామీణ శ్రామికుల సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో జిల్లా సిఐటియు నాయకులు ఎన్. నాగేశ్వరరావు, మండల నాయకులు వేల్పుల ఏసోబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సిఐటియు నాయకులు ఎన్.నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామీణ శ్రామికుల సర్వేలో భాగంగా కోనయపాలెంలో 80 కుటుంబాలను కలవడం జరిగిందన్నారు. ఇందులో ఎక్కువ మంది ఎస్సీ సామాజిక వర్గానికి సంబంధించిన వ్యక్తులు వ్యవసాయ కూలీలుగా చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి పొలం పనులు చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పెయింటింగ్ పనులు కోసం మండల కేంద్రాలు మరియు పట్టణాలకు వెళ్లి పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికులుగా ఎక్కువమంది బీసీ సామాజిక వర్గానికి సంబంధించిన వారిగా ఉన్నారఉన్నారని, అదే కాకుండా కొంతమంది డ్రైవర్లు, హెల్పర్లు, వెల్డింగ్ వర్కులు చేస్తూ ఉన్నారు . అక్కడక్కడ బైక్ ట్రాక్టర్,లారీ మెకానికులు ఉన్నారని, చదివిన చదువులకు ఉద్యోగుల రాక ఆటో,డ్రైవర్లు మరియు బిల్డింగ్ వర్కర్స్‌గా, పట్టణాల్లో బట్టల షాపులు, కిరణ కొట్లల్లో గుమస్తాలుగా పనిచేస్తున్నారని విమర్శించారు. చాలామంది అనారోగ్య పరిస్థితుల్లో ప్రభుత్వాసుపత్రికి వెళుతూ వైద్యం చేయించుకుంటున్నారని, అత్యవసర వైద్యం చేయించుకోవాల్సి వస్తే ప్రైవేట్ హాస్పిటల్ ను ఆశ్రయిస్తూ వేలకు వేలు ఖర్చు పెడుతున్నారని తెలిపారు. ఈ సర్వే నేపథ్యంలో ఎస్సీ,ఎస్టీ, బీసీ ఎక్కువమంది కుటుంబాల పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారని ఉపాధి హామీ పనులు చేయటానికి కొంతమందికి మాత్రమే అవకాశం ఉంటుందని చాలామందికి పని దొరకని పరిస్థితులు పడుతుందని ఈ సర్వే ద్వారా తెలిసిందని తెలియజేశారు. ఈ సర్వే కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్ మండల కార్యదర్శి జె.లక్ష్మయ్య జె.మహేష్,వేణు, జె.సురేష్,రమేష్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-వీరులపాడు:** గ్రామీణ సర్వే కార్యక్రమం జుజ్జూరు గ్రామంలో బీసీ కాలనీ, అరుగు సెంటర్, ఎస్సీ కాలనీ, ముస్లిం ఏరియా, పంజా సెంటర్, గాంధీ బొమ్మ సెంటర్ సర్వే నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకురాలు కమల, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోట కళ్యాణ్,చాట్ల రవి, లాల్ మహమ్మద్‌గౌస్, మంగళపూడి సుందర్‌రావు పాల్గొన్నారు.



శ్రీ అక్షర హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కంచికచర్ల: పదవ తరగతి పరీక్షల ఫలితాల్లో కంచికచర్ల కు శ్రీ అక్షర ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు శ్రీ అక్షర విద్యా సంస్థల ఛైర్మన్ గడుపూడి శ్రీరామ్ ఆదివారం తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరంలో శ్రీ అక్షర హైస్కూల్ నుంచి పరీక్షకు హాజరైన విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో పాఠశాలకు చెందిన గోకవరపు ఉష 585 మార్కులతో కంచికచర్ల టౌన్ ఫస్ట్ సాధించినట్లు తెలిపారు. అలాగే జి పావని లక్ష్మీ, 577 మార్కులు, జి విజయశివ నాగరాణి 573 మార్కులు సాధించినట్లు తెలిపారు. పరీక్షలకు హాజరైన వారిలో 35 మంది లబ్ధిదారులు 500 కు పైగా మార్కులతో విజయ దుందుభి సాధించారన్నారు. కంచికచర్ల లో శ్రీ అక్షర ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ స్థాపించినప్పటి నుండి కంచికచర్ల, వీరులపాడు, ఇబ్రహీంపట్నం మండలాల పరిధిలో గ్రామీణ పేద విద్యార్థులకు తక్కువ ఫీజులతో ఉత్తమమైన, నాణ్యతతో కూడిన విద్రనందిస్థునతనట్లు తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులను ఛైర్మన్ గడుపూడి శ్రీరామ్, సెక్రటరీ, కరస్పాండెంట్ కాసరగడ్డ రామారావు, సిబ్బంది అభినందించారు.


గోకవరపు ఉష

కెవిఆర్ జడ్‌పి పాఠశాల విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు

మండల కేంద్రమైన పెనుగంచిప్రోలు కెవిఆర్ జడ్పీ పాఠశాల విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విజయకేతనం ఎగరవేశారు. పాఠశాలలో మొత్తం 145 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుగా, వారిలో 112మంది విద్యార్థులు పాసయ్యారు. పాఠశాల మొత్తం 77 శాతం ఉత్తీర్ణత సాధించారు. 500 మార్కులకు పైగా 17 మంది విద్యార్థులు సాధించారు. ప్రభుత్వ పాఠశాలలలో పెనుగంచిప్రోలు మండలంలో ఫస్ట్ క్లాస్, సెకండ్ క్లాసు కె వి ఆర్ పాఠశాల విద్యార్థులు సాధించారు. 90 మంది బాలురకు 63 మంది పాసయ్యారు. 55 మంది బాలికలకు 49 మంది పాసయ్యారు. రేగండ్ల నాగ త్రిశూల్ 571 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలలో పెనుగంచిప్రోలు మండలంలో ఫస్ట్ వచ్చాడు. బాడిశ తరుణశ్రీ 560 మార్కులతో మండలంలో సెకండ్ వచ్చిందని పాఠశాల హెచ్ఎం జలజ తెలిపారు.

ఉల్లాసంగా ఉమెన్ చెస్ పోటీలు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: కృష్ణా జిల్లా సీనియర్ ఉమెన్ చెస్ పోటీలు పోరంకిలోని గ్రీన్ స్కూల్లో ఆదివారం ఉత్సాహభరితంగా జరిగాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.ఐదు రౌండ్లుగా జరిగిన పోటీలలో ఉమెన్ ఫిడే మాస్టర్ పొట్లూరి సుప్రీతా ఐదు పాయింట్లు సాధించి ప్రథమ స్థానం సాధించింది. కె. జాహ్నవి నాలుగు పాయింట్లు సాధించి ద్వితీయ స్థానం సాధించగా, కె.లక్ష్మి సాహితీ,నాలుగు పాయింట్లు సాధించి మూడవ స్థానం, సాధించింది. బి.కవిత 3.5 పాయింట్లు సాధించి నాల్గవ స్థానం సాధించింది. ఈ టోర్నమెంట్లో మొదటి నలుగురు రాష్ట్ర స్థాయీ పోటీలకు ఎంపికయ్యారని కష్ణా జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రెటరీ ఫణి కుమార్ తెలిపారు. మే 17 నుండి 21 వ తేదీ వరకు విజయవాడలో రాష్ట్ర స్థాయి చెస్ పోటీలలో కష్ణా జిల్లా తరపున అడతరని తెలిపారు.అలాగే అండర్ -7, 9, 11, 13, 15 ఏజ్ గ్రూప్ విభాగంలో జరిగిన పోటీలలో క్రీడాకారులకు నగదు బహుమతులు అందజేశారు.ముగింపు కార్యక్రమంలో యస్ఆర్ఆర్ చెస్ కోచింగ్ అకాడమీ డైరెక్టర్ పి.రేణుక, గన్నవరం చెస్ మేనేజర్ ఆనంద్, కష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ సెక్రెటరీ యన్. యమ్.ఫణి కుమార్ బహుమతులను అందచేశారు.



నేటి నుండి వేసవి శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం శాఖ గ్రంథాలయంలో మే8 నుండి జూన్ 16 వరకు ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి కె ఆర్ఎస్‌దీపిక ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరగతుల్లో చిత్రలేఖనం స్పోకెన్ ఇంగ్లీష్ పేపర్ క్రాఫ్ట్ కథలు చెప్పించడం చదివించడం తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తండ్రీకొడుకులు దుర్మరణం

ప్రజాశక్తి-వీరులపాడు: నందిగామ నియోజవర్గంలోని వీరులపాడు మండలంలోని అల్లూరు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పరిటాల గ్రామానికి చెందిన సయ్యద్ ఖాదర్ ఘటన స్థలంలోనే మతి చెందగా, ఆయన కుమారుడు జానీ భాషా తీవ్ర గాయాల పాలవటంతో విజయవాడ ఆస్పత్రికి తరలించగా ఆసుపత్రిలో జానీ భాష మతి చెందారు.సయ్యద్ ఖాదర్ ను మతదేహాన్ని నందిగామ మార్చురీకి తరలించగా ఆయన భౌతికకాయాన్ని శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు సందర్శించి నివాళులర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పరిటాల గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మందికి గాయాలు

జగ్గయ్యపేట: రెండు కార్లు, రెండు బైకులు ఒకేసారి ఢీకొన్న సంఘటనలో 9 మంది గాయాలు కాగా వారిలో ఇరువురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని గౌరవరం గ్రామంలో 65 వ నెంబర్ జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. సేకరించిన సమాచారం మేరకు హైదరాబాదు నుండి విజయవాడ వెళుతున్న కారు గౌరవరం గ్రామంలో రోడ్డు క్రాస్ చేస్తున్న బైకును వేగంగా ఢీ కొట్టి హైదరాబాద్ వెళుతున్న కారును, బైకును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో 9 మంది గాయపడగా వీరిలో ఇరువురి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన క్షతగాత్రులను మూడు అంబులెన్స్ లలో జగ్గయ్యపేట, నందిగామ, విజయవాడకు తరలించారు. రోడ్డుపై ఒక్కసారిగా రెండు కార్లు, బైకులు ఢీకొనడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. వెంటనే స్పందించిన చిల్లకల్లు పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలం వద్దకు వచ్చి క్రేన్ తో కార్లను పక్కకు తీసి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

104 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలి : సిఐటియు



ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: గతంలో మాదిరిగానే 104 సేవలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్న హామీని తక్షణమే అమలు చేయాలని 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. 104 ఉద్యోగుల ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సమావేశం ఇబ్రహీంపట్నం సిఐటియు కార్యాలయంలో 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు యం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా 104లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఎంప్లాయిస్‌ని రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీని ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని 104 ఎంఎంయు ఉద్యోగుల సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ డి సందీప్ కుమార్, ఎన్టీఆర్ జిల్లా ప్రెసిడెంట్ యం శ్రీనివాస్, సెక్రటరీ వర రాజేష్ డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 4459 ప్రకారం పిఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు చేసి ఎంప్లాయిస్ కాంట్రిబ్యూషన్ యాజమాన్యమే చెల్లించాలి 104 ఉద్యోగులందరికీ స్లాబ్ సిస్టం ఆటోమేటిగ్గా అప్డేట్ చేయాలన్నారు. ప్రస్తుతం 104 ఎంఎంయూలో పనిచేస్తున్న ఉద్యోగులకు బదిలీ అవకాశం కల్పించి ఫుడ్ అలవెన్స్ ట్రావెల్ అలవెన్స్ ఇతర బెనిఫిట్స్ అలవెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం సిఐటియు నాయకులు యం మహేష్, 104 ఉద్యోగుల సంఘం నాయకులు కె మురళీ, జి త్రినాధ్, వి గోపి, పి,కిరణ్‌కుమార్, డి వెంకట్రామయ్య పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

• పరిశీలించిన ఎంఎల్ఎలు, కలెక్టర్


ముఖ్యమంత్రి పర్యటన సభ ఏర్పాట్లపై పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గుడివాడ : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఈ నెల 19 వ తేదీన గుడివాడలోని టిడ్కో గహాలను ప్రారంభించి లబ్ధిదారులకు పంపిణీ చేయునున్న నేపథ్యంలో ఆదివారం గుడివాడలో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మచిలీపట్నం, గుడివాడ, శాసన సభ్యులు పేర్ని వెంకట్రామయ్య(నాని), కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), జిల్లా ఎస్పీ పి.జాషువా లతో కలసి గుడివాడలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు గుడివాడలో నిర్మాణాలను పూర్తి చేసుకున్న టిడ్కో గహాల ప్రాంగణంలో పర్యటించి ముఖ్యమంత్రి బహిరంగ సభా ప్రాంగణం, హెలీపాడ్, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై అనువైన స్థలాల కోసం పరిశీలించారు. బహిరంగ సభ కోసం టిడ్కో గహాల పక్కనే ఉన్న ఖాళీ స్థలాలను పరిశీలించారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడ వర్షపు నీరు నిలవటంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై చర్చించారు. ఈ రెండుమూడు రోజుల్లోని వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సభాస్థలి ఏర్పాట్లపై ముందుకు వెళ్లేలా చర్చించుకున్నారు. అనంతరం స్థానిక శాసన సభ్యులు కొడాలి నాని మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికే తలమానికమైన అన్ని వసతులను కల్పించి నిర్మించిన దాదాపు 9 వేల టిడ్కో గహాలను ఈ నెల 19 న రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించి లబ్ధిదారులకు పంపిణీ చేయునున్నట్లు వెల్లడించారు. దీనికోసం దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 2008వ సంవత్సరంలోనే టిడ్కో గహ నిర్మాణాల నిమిత్తం 77 ఎకరాలను భూసేకరణ చేసినట్లు గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఈ నిర్మాణాలను చేపట్టి కనీసం 25 శాతం కూడా పూర్తి చేయకుండా వదిలేశారని అన్నారు. తర్వాత అధికారాన్ని చేపట్టిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దీని కోసం రూ.600 కోట్లను కేటాయించి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా దాదాపు 9 వేల గహాలను నిర్మించి లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధమయ్యారని చెప్పారు. అదేవిధంగా ఇదే నెలలో 22 వ తేదీన మరో గొప్ప కార్యక్రమం మచిలీపట్నం పోర్టు పనులను సీఎం ప్రారంభిస్తారని, దీనికి సంబందించిన ఏర్పాట్లను మచిలీపట్నంలో ఉదయం పరిశీలించామని తెలిపారు. పోర్టు కోసం 19 వందల ఎకరాల భూమిని సేకరించడం జరిగిందని, అన్ని అనుమతులు పొంది రూ.4 వేల కోట్లకు పైగా వ్యయంతో నిర్మిస్తున్న పోర్టును రెండు సంవత్సరాల్లో నాలుగు బెర్తలను పూర్తి చేసి అందుబాటులోనికి తీసుకొచ్చే విధంగా ముఖ్యమంత్రి రూపకల్పన చేశారని అన్నారు. ఈ పర్యటనలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, టిడ్కో ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.చిన్నోడు, గుడివాడ, బందరు రెవెన్యూ డివిజన్ల అధికారులు పి.పద్మావతి, ఐ.కిషోర్, గుడివాడ మున్సిపల్ కమిషనర్ మురళీకష్ణ వివిధ శాఖల అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

రోడ్డు బాగుచేయాలని నిరసన

కూచిపూడి - పెడసనగల్లు



ప్రజాశక్తి - మొవ్వ : వాణిజ్య కేంద్రమైన కూచిపూడి నుండి పెడసనగల్లు వెళ్ళే ప్రధాన రహదారి అడుగుకో గుంట గజానికో గొయ్యిలా మారి ప్రమాదాలకు హేతువుగా మారినా సంభందిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దారుణమని తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షులు పెదపూడి ఆనంద్ ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వహణ లేక వర్షపు నీటితో చెరువును తలపిస్తోన్న కూచిపూడి - పెడసనగల్లు రోడ్డులోని ఓ గొయ్యివద్ద ఆనంద్ వాహనదారులు, పాదాచారులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూచిపూడి నుండి భట్లపెనుమర్రు వరకు రోడ్డు మరమ్మ త్తుల కోసం ఆర్ అండ్ బి శాఖ నిధులు కేటాయిస్తే ఆ నిధులను పెడసనగల్లు నుండి భట్లపెనుమర్రు వరకు ఉన్న రోడ్డుకు వినియోగించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కనీస మరమత్తులు కూడా లేక వాహనాలు తరచూ మరమత్తులకు గురవుతున్నాయని ,పాదాచారులకు సైతం ప్రత్యక్ష నరకం చూపిస్తున్న కూచిపూడి -పెడసనగల్లు రోడ్డుకు తక్షణమే మరమ్మ త్తులు చేయించాలని ప్రజాగ్రహానికి గురికాక ముందే ప్రభుత్వ పెద్దలు రోడ్డు పునర్నిర్మాణానికి కషి చేయాలని తెలుగుయువత నేత ఆనంద్ హితవు పలికారు.


దెబ్బతిన్న మొక్కజొన్న పరిశీలిస్తున్న గణేష్‌రెడ్డి

వర్షాలకు దెబ్బతిన్న పంటలు కొనుగోలు చేస్తాం

ప్రజాశక్తి-పమిడిముక్కల : వర్షాలకు దెబ్బ తిన్న పంటలను కొనుగోలు చేస్తామని పమిడిముక్కల మండల వ్యవసాయ శాఖ అధికారి గణేష్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని మేడూరు, ధూళిపూడిపాలెం, వీరంకిలాకు తదితర గ్రామాల్లో పర్యటించి వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న తదితర పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న పంటలను రైతుల వద్ద నుంచి రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని అన్నారు. రైతులు అధైర్యపడోద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్లో 'స్పందన'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కష్ణాజిల్లా మచిలీపట్నం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల 30 నిముషాల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు ఒక ప్రకటనలో తెలిపారు. కాబట్టి ఆయా శాఖల ఉన్నతాధికారులు స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. డివిజన్, మండల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు తమ అర్జీలను మండల, డివిజన్ స్థాయిలోనూ సమర్పించ వచ్చునని కలెక్టర్ తెలిపారు.

అల్లూరి సీతారామరాజు వర్ధంతి

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక నూతన మున్సిపల్ కార్యాలయం సమీపంలో గుడివాడ క్షత్రియ సేవ సమితి, స్మారక కమిటిల సంయుక్తం అధ్వర్యంలో దేశభక్తుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతిని ఘనంగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ లంకదాసరి ప్రసాదరావు మాట్లాడుతూ బ్రిటిష్ వారు మన్యం ప్రాంతంలోని గిరిజనుల హక్కులను కాలరాస్తు, స్త్రీలని వేధిండం. గిరిజనులు భూములని లాక్కొనప్పుడు అల్లూరి సీతారామరాజు గిరిజనులని చైతన్య పరిచి, బ్రిటిష్ వారిపై అల్లూరి విప్లవం రెండు దశలలో పోరాడరన్నారు. 1924 మే 7న బ్రిటిష్ వారు అల్లూరిని కాల్చిచంపారన్నారు. భోగాపురం ఎయిర్పోర్ట్‌కి అల్లూరి సీతారామరాజు ఎయిర్పోర్టుగా నామకరణం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీతారామరాజు సార్మక కమిటి ఫౌండర్, సాగిరాజు ఉదయభాస్కరరాజు, సేవసమితి గౌరవ అధ్యక్షడు గాదిరాజు జగ్గరాజు, క్షత్రియ సేవ సమితి అధ్యక్షులు కోసూరి కామరాజు(రవిరాజు) పాల్గొన్నారు.


గుడివాడలో...


మొవ్వలో...

అలాగే పోరాటాల వీరుడు మన్యం దొర అల్లూరి సీతారామరాజు వర్ధంతిని పురష్కరించుకుని జనసేన నాయకులు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అధ్వర్యంలో సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జనసేన నాయకులు షేక్ మీరాషరీఫ్, నూనె అయ్యప్ప పాల్గొన్నారు. **ప్రజాశక్తి - మొవ్వ :** బ్రిటిష్ పాలకుల ఎదురొడ్డి పోరాడి నిలిచి వారి తుపాకి గుళ్ళకు బలైన విప్లవ యోధుడు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ధైర్య సాహసాలు, పోరాటపటిమ నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోసూరు మాజీ సర్పంచ్ చిందా వీర వెంకట నాగేశ్వరరాజు(బుజ్జి) పిలుపునిచ్చారు. అల్లూరి వర్ధంతి సందర్భంగా ఆదివారం మొవ్వ మండలంలోని కోసూరు గ్రామంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు జిల్లా ప్రజానాట్యమండలి కన్వీనర్ కోసూరువెంకట అప్పారావు, గ్రామఉపసర్పంచ్ దళపతిరావు రామకష్ణంరాజు, మండల బిజెపి అధ్యక్షుడు డాక్టర్ ఎన్. నరసరాజు, గ్రామస్తులు చిందా కష్ణంరాజు, చిందాశ్రీనివాసరాజు, దళపతిరావు వెంకట రామరాజు, బోరుకాటి సుబ్రహ్మణ్య రాజు, దళపతిరావు శ్రీనివాసరాజు తదితరులు, క్షత్రియ సంఘం యోజన నేతలుఅధిక సంఖ్యలో హాజరైనారు అలాగే పెదముత్తేవిలోక్షత్రియ సంఘం సభ్యులుఅల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



వేసవి విజ్ఞాన తరగతుల గోడ పత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ గ్రేడ్ వన్ గ్రంథాలయంలో సోమవారం నుండి ఈనెల 11వ తేదీ వరకు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి జే ప్రభుదాస్ చెప్పారు. ఆదివారం గ్రంథాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజ్ఞాన తరగతులు ప్రతిరోజు ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆరవ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్య నిర్దేశించే విద్యార్థులు పాఠకులు ఈ విజ్ఞాన తరగతుల్లో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా విజ్ఞాన తరగతులకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ కోడూరు సత్యనారాయణ అవనిగడ్డ హెడ్ పోస్ట్ మాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు సిబ్బంది పాఠకులు పాల్గొన్నారు



నిరుపేదలకు అన్నదానం

విజయవాడ : ఓపెన్ ఆర్ట్ సోషల్ సర్వీస్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆదివారం అన్నదానం నిర్వహించారు. విజయవాడలోని ఆటోనగర్ ప్రాంతం అలాగే మంగళగిరి ప్రాంతాల్లో సుమారు నాలుగువేల మంది నిరుపేదలకు అన్నదానం, వస్త్రదానం చేశారు. ఈకార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ రాసంశెటిట నందకిషోర్, ప్రెసిడెంట్ తనూజారాణి, ట్రస్టు వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పేద కళాకారులకు సాయం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : ప్రభుత్వం పేద కళాకారులుని గుర్తించి కళాకారుల పెన్షన్స్ అందచేయాలని కళాకారుల సంక్షేమ సంఘము లీగల్ అడ్వైజర్ లంకిశెట్టి బాలాజి అన్నారు. దుర్గా మల్లేశ్వరి కళా పీఠం ఆధ్వర్యంలో ఆదివారం మచిలీపట్టణం లొని లంకిశెట్టి కార్యాలయంలో నలుగురు పేదకళాకారులకు రూ.4,000 ఆర్థిక సహాయంని దాతలు లంకిశెట్టి బాలాజి, పైడిపాటి రాందేవ్,చలమలశెట్టి గాంధీ,ఏ,ఎస్,అర్,మూర్తి అందచేశారు. చింతామణి, సత్య హరిచ్చేంద్రుడు,బాల నాగమ్మ వంటి నాటకాలలో పాత్రలు చేసిన ప్రముఖ నటులు నేడు వత్తి లేక దయనీయ పరిస్థితి లో ఉన్నారని వారిని ఆదుకోవాలని బాలాజి జిల్లా కలెక్టర్ ని కోరారు. మచిలీపట్టణం, పెడన, గుడివాడ నియోజక వర్గంకు చెందిన పేద కళాకారులుకి అర్ధిక సహాయం అందచేశారు.



ఆర్‌టిసి నష్టాల నివారణకు చర్యలు

- గత ఆర్థిక సంవత్సరంలో రూ.130 కోట్ల మేర నష్టాల భర్తీ
- ఒఆర్ పెంపునకు పలు స్కీమ్‌లు
- బస్‌స్టేషన్లలో చలివేంద్రాలు
- ప్రజాశక్తితో ఆర్‌టిసి ఆర్‌ఎం ఎంవై దానం





ప్రజాశక్తి - విజయవాడ : ఆర్‌టిసిలో నష్టాన్ని భర్తీ చేసేందుకు వివిధ రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఎపిఎస్ ఆర్‌టిసి ఎన్‌టిఆర్ జిల్లా ప్రజారవాణా అధికారి (ఆర్‌ఎం) ఎంవై దానం చెప్పారు. ప్రయాణీకులను ఆకట్టుకునేందుకు వివిధ రకాల పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ఒఆర్ పెంపునకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రయాణీకులను ఆకట్టుకునేందుకు, వారు ప్రైవేటు సర్వీసుల వైపు వెళ్లకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. వేసవి సెలవుల నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతోపాటు ఇంకా అనేక మంది యాత్రా స్థలాలు చూసేందుకు ఆసక్తి చూపుతారని, వారికి అందుబాట్లో ఆర్‌టిసి సర్వీసులను ఉంచేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అరుణాచలం, ద్వారకాతిరుమల, అరుకు వ్యాలీ తదితర ప్రాంతాలకు ఆర్‌టిసి సర్వీసులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రత్యేక సర్వీసులకు సాధారణ చార్జీలు మాత్రమే ఉంటాయన్నారు. వేసవి దృష్ట్యా బస్‌స్టేషన్లలో ప్రయాణీకులకు రక్షిత మంచినీటి సదుపాయం కల్పించామని తెలిపారు. ఆర్‌ఎం దానం ఆర్‌టిసి ప్రయాణీకుల సౌకర్యార్థం తీసుకుంటున్న చర్యలపై ప్రజాశక్తికి ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: ఒఆర్ పెంపునకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలేమిటి ?

ప్రయాణీకుల సంఖ్య పెంపునకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ఈ ఏడాది మార్చి చివరినాటికి 62 శాతం ఒఆర్ ఉండగా, దానిని 70 శాతానికి తీసుకెళ్లడానికి ప్రణాళిక సిద్ధం చేశాం. గత నెలలో డిపో మేనేజర్ల ప్రత్యేక సమావేశం నిర్వహించి, దిశానిర్దేశం చేశాం. ప్రధానంగా క్వాలిటీ ఆఫ్ సర్వీసు, సర్వీసు క్లీన్‌అండ్ నీట్, పాసింజర్లతో మర్యాదగా మెలగడం, చెయ్యెత్తిన చోట ప్రయాణీకులను ఎక్కించుకోవడం, అడిగిన చోట దింపటం తదితర రూపాల్లో నాణ్యమైన సర్వీసులను అందిస్తాం.

ప్రశ్న: జిల్లాలో సర్వీసులెన్ని ? రోజుకు ఎన్ని కిలోమీటర్లు తిరుగుతాయి?

ఎన్‌టిఆర్ జిల్లా పరిధిలో 760 సర్వీసులున్నాయి. విజయవాడ నగర పరిధిలో 390 ఉన్నాయి. రోజుకు 2.80 లక్షల కిలోమీటర్లు తిరుగుతుంటాయి. రోజూ రూ.1.20 కోట్ల రాబడి వస్తుంది. గత ఆర్థిక సంవత్సరం 2022-23లో రూ.130 కోట్ల మేర నష్టాన్ని భర్తీ చేశాం.

ప్రశ్న: పిఎన్ బస్‌స్టేషన్ పరిధిలో ప్రైవేటు ట్రావెల్స్, ఇతర సర్వీసుల నియంత్రణకు తీసుకుంటున్నచర్యలు ఏమిటి ?

ప్రైవేటు ట్రావెల్స్ తాకిడిని నివారించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. డిపో మేనేజర్ స్థాయి అధికారితోపాటు 12 మంది సిబ్బందితో ఓ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశాం. ప్రతి డిపో పరిధిలో రెండు కిలోమీటర్ల పరిధి వరకు ప్రైవేటు ట్రావెల్స్ ట్రావెల్స్ పార్కింగ్ చేయకూడదని నిబంధన విధించాం. జిల్లావ్యాప్తంగా 100కు పైగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ఉండొచ్చు. ట్రాన్స్‌పోర్టు, పోలీసులు సంయుక్తంగా వీటి తాకిడిని నియంత్రించాల్సి ఉంటుంది.

ప్రశ్న: కొత్తగా ఎన్ని సర్వీసులు కావాలని ప్రతిపాదించారు ?

విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు మరో 25 సర్వీసులు కావాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నగరం పరిధిలో ప్రయాణీకుల రద్దీ ఎక్కువగా ఉండే పలు సెంటర్లలో నూతన బస్ షెల్టర్లను ఏర్పాటు చేస్తాం. వీటిని నగరపాలక సంస్థ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. బెంజిసర్కిల్, ఏలూరు పాయింట్, వారధి, కళాణికేతన్ (పివిపి వద్ద), రామవరప్పాడు తదితర ప్రాంతాలోల బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇందుకోసం మూడు నెలల క్రితం విజయవాడ నగర పాలక సంస్థకు లేఖ కూడా రాశాం.

ప్రశ్న: బస్‌స్టేషన్లలో వేసవి మంచినీటి ఎద్దడి నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

పిఎన్ బస్‌స్టేషన్‌లో రక్షిత మంచినీటి సదుపాయం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అలాగే జిల్లాలోని జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం బస్‌స్టేషన్లతోపాటు మండల కేంద్రాలైన పెనుగంచిప్రోలు, నందిగామ, కంచికచర్ల, మైలవరం, వత్సవాయి తదితర ప్రాంతాల్లో అదనంగా చలివేంద్రాలు ఏర్పాటు చేశాం.

తడిసిన ధాన్యం తక్షణమే మిల్లులకు తరలింపు

ప్రత్యేకాధికారి గిరిజా శంకర్ ఆదేశం

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : వర్షంతో తడిసిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా రైస్ మిల్లులకు తరలించేందుకు రైతులకు గన్నీ బ్యాగులు అందించి రవాణా సౌకర్యాన్ని కల్పించాలని సంబంధిత అధికారులను కమర్షియల్ ట్యాక్స్ చీఫ్ కమిషనర్, ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేకాధికారి ఎం.గిరిజా శంకర్ ఆదేశించారు. అధికారులు ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విజయవాడ రూరల్ మండలం పాతపాడు, కుందావరి కండ్రిక వద్ద ఎన్‌హెచ్‌ఎఐ బైపాస్ రోడ్డుపై వర్షానికి తడిసి ఆరబెడుతున్న ధాన్యాన్ని గిరిజాశంకర్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ సంపత్‌కుమార్, జిల్లా సరఫరా అధికారి (డిఎస్‌ఒ) కోమలి పద్మ ఆదివారం పరిశీలించారు. గిరిజాశంకర్ వరిలో తేమ శాతాన్ని పరిశీలించి, మిల్లులకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న వరి బస్తాల తూకాన్ని పరీక్షించారు. వర్షానికి తడిసిన వరి, మొక్కజొన్న, జొన్నలు రోడ్లపై ఆరబెట్టి మిల్లులకు లిఫ్ట్ చేసే సమయంలో ఎదురవుతున్న సమస్యల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని వీలైనంత త్వరగా మిల్లులకు తరలించాలని రైతులు గిరిజాశంకర్‌ను కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుత గన్నీ బ్యాగుల కొరత లేదని, పౌరసరఫరాల శాఖలో ఇప్పటివరకు దాదాపు 6 లక్షల బస్తాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కోరినప్పుడల్లా అధికారులు రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. రైతులు తమ ఉత్పత్తులను ప్రయివేటు వ్యాపారులకు విక్రయించేందుకు ఆసక్తి ఉంటే అధికారులు అనుమతించాలన్నారు. వరిలో తేమ స్థాయిని ప్రస్తావిస్తూ, మిల్లర్లు రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె) నివేదికను తీసుకోవాలని కోరారు. కొంతమంది మిల్లర్లు తేమను ప్రత్యేకంగా పరిశీలించి, అది ఆర్‌బికె ఇచ్చిన నివేదిక కంటే అధికంగా ఉందంటూ ధరను తగ్గించడం సరికాదన్నారు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ను తగ్గించేందుకు సాకులు చెబుతున్నారని, ఈ విషయంలో అధికారులెవరూ మిల్లర్లను ప్రోత్సహించొద్దని ఆదేశించారు. రెవెన్యూ, వ్యవసాయ అధికారులు పరస్పరం సమన్వయం చేసుకొని వర్షంతో తడిసిన వరిపైరు రైతులకు సహకరించాలని సూచించారు. అలాగే జిల్లాలో నిలిచిన వరి పంట కోతలపై ఆరా తీశారు. వర్షాల హెచ్చరికల దృష్ట్యా పంటలు కోయవద్దని సూచించారు. వ్యవసాయ శాఖ విజయవాడ డివిజన్ సహాయ సంచాలకులు బి.వెంకటేశ్వరరావు, విజయవాడ రూరల్ మండల ఎఒ బి.రంగనాథ్ బాబు, కెవి కండ్రిక పిఎసిఎస్ అధ్యక్షులు ఎం.రవీంద్రారెడ్డి, తహశీల్దారు జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి గిరిజా శంకర్

కార్మికులకు అండ...సిఐటియు జెండా..

(మొదటి పేజీ తరువాయి)

వారి పిల్లలను డివి.కృష్ణ అభినందించారు. భవిష్యత్తులో సాంస్కృతికంగా కూడా ప్రత్యామ్నాయన్ని కార్మికుల వద్దకు తీసుకెళ్లి కార్మిక పోరాటాలను మరింతగా పెంచాలని అన్నారు. ఈకార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏ.వెంక టేశ్వరరావు, కార్యదర్శి ఏ.కమల, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్య బాబు, సిఐటియు పశ్చిమ సిటీ అధ్యక్ష కార్యదర్శులు జి.వెంక ట్రావు, ఇ.వి.నారాయణ, సిటీ నాయకులు దాసు, శంకర్, సుబ్బా రెడ్డి, ఉమాదేవి, గజలక్ష్మి, శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.







సవరణ

ది.5-7-2022 న ప్రజాశక్తి దినపత్రిక ఎన్.టి.ఆర్ కృష్ణాజిల్లా పత్రికలో నా క్లయింటు కడియాల వెంకట్రామయ్య గారి కుమారుడు శేషగిరి రావు సంజాయిషీతో యిచ్చిన సవరణలో చివరి లైనులో దస్తావేజు నెం.2336/1988 అని తప్పుగా ప్రచురితమైనది. కావున, సదరు దస్తావేజు నెం.2335/1988 గా చదువుకొనగలరు.

విజయవాడ,
తేది:08/05/2023

ఇట్లు
కంఠమనేని శాంతి,
న్యాయవాది,
సెల్ నెం.9490911024

మొదటి పేజీ తరువాయి

అక్టోబర్ నాటికి ఫిషింగ్ హార్బర్ నిర్మాణం పూర్తి

ఫేజ్-1లో నాలుగు, ఫేజ్-2లో ఐదు హార్బర్ల నిర్మాణం కానున్నాయి. ఉప్పాడ, మచిలీపట్నం, జువ్వలదిన్నె, నిజాంపట్నంలలో ఫేస్-1 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ 28 ఎకరాల విస్తీర్ణంలో రూ.421.17 కోట్ల అంచనా విలువతో 24 నెలల వ్యవధిలో నిర్మించేలా హైదరాబాద్‌కు చెందిన ఎంఆర్‌కెఆర్ కన్‌స్ట్రక్షన్స్ 2021 మార్చి 18వ తేదీన ఇంజనీరింగ్, ప్రొక్యూర్మెంట్ అండ్ కంస్ట్రక్షన్ (ఇపిసి) కాంట్రాక్ట్ ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందం ప్రకారం కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నిర్మాణం పనులను వేగంగా చేస్తోంది.

ప్రశ్న : హార్బరుకు అనుసంధానంగా ఏమైనా నిర్మాణాలు చేయబోతున్నారా?

సముద్రతీరాన ఉన్న పాయ పక్కన హార్బరుకు సంబంధించి పలు భవనాలు నిర్మించేందుకు పనులు ప్రారంభించాము. సముద్రం పాయ దక్షిణం వైపున ఉన్న 28 ఎకరాల విస్తీర్ణంలో 23 భవనాల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధంగా ఉంది. వీటిలో ముఖ్యంగా అడ్మినిస్ట్రేటివ్ భవనం, హార్బర్ మేనేజ్‌మెంట్ కార్యాలయ భవనం, గేర్‌కట్టింగ్, గెస్ట్‌హౌస్, పోలీస్‌స్టేషన్, పెట్రోల్ బంక్, ఫిష్ హ్యాండ్లింగ్ అండ్ ఆక్షన్ హాల్స్, టున ఫిష్ హ్యాండ్లింగ్ అండ్ ఆక్షన్ హాల్స్, 10 టన్ ఐస్ ప్లాంట్, 20 టన్ కోల్డ్ స్టోరేజ్, సోలార్ పార్క్ 500 కెఎల్‌డి, అండర్ గ్రౌండ్ వాటర్ ట్యాంక్, 500 కెఎల్‌డి సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్, క్యాంటీన్, తదితర భవనాలను నిర్మించనున్నాం.

ప్రశ్న : ప్రతిపాదిత ఫిషింగ్ హార్బర్ ఫ్లీట్ సైజ్ తెలుపగలరు?

మచిలీపట్నంలో నిర్మితమవుతున్న ఫిషింగ్ హార్బర్లో ప్రతిపాదించిన సదుపాయాలతో 550 బోట్లు నిలిపేందుకు ఫిషింగ్ ఫ్లీట్ వార్షికంగా 23,500 టన్నుల చేప ఉత్పత్తులు దిగుమతికి అవకాశం ఉండేలా ఉంటుంది. రూ20,630 లక్షల ఆదాయం వస్తుంది. 3300 మందికిపైగా ఉద్యోగ అవకాశాలు కలుగుతాయి.

ప్రశ్న : హార్బర్ పని పూర్తి చేసేందుకు టైం ఫ్రేమ్ ఏమైనా ఉందా? ఇప్పటివరకు జరిగిన పనులు టైమ్ ఫ్రేమ్‌లోనే జరిగాయా?

హార్బర్ పని పూర్తి చేసేందుకు టైం ఫ్రేమ్ ఉంది. సముద్ర మొగ డ్రెడ్జింగ్, పైల్ ఫౌండేషన్, సూపర్ స్ట్రక్చర్ నిర్మాణానికి 2023 ఏప్రిల్ 30వ తేదీ, బ్రేక్ వాటర్ (రాక్ వర్క్స్ కోసం 2023 జూలై 30వ తేదీ, టెట్రాపోడ్ ఆర్మర్ ప్లేసింగ్ కోసం 2023 సెప్టెంబర్ 31వ తేదీ వరకు), లాండ్ బేస్డ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం 2023 సెప్టెంబర్ 31వ తేదీ వరకు టైమ్ లైన్ నిర్ణయించబడింది. ఇప్పటి వరకు కాంట్రాక్టర్ పనులన్నీ టైంలైన్‌లోనే పూర్తి చేశారు.

ప్రశ్న : బ్యాక్ వాటర్, క్వే వర్క్స్ సంబంధించి పనులు ఎంత వరకు పూర్తయ్యాయి?

క్వే వర్క్స్ (రాతి నిర్మాణాలు)కు సంబంధించి పైల్ ఫౌండేషన్స్, ప్రీకాస్ట్ యూనిట్స్ పనులు దాదాపు పూర్తయ్యాయి. 264 పైల్ ఫౌండేషన్స్‌గాను 261, 1024 ప్రీకాస్ట్ యూనిట్స్‌గాను 818 పూర్తయ్యాయి. బ్రేక్ వాటర్ (ఉత్తరం, దక్షిణం ట్రైనింగ్ వాల్ నిర్మాణం) సంబంధించి 6.27 లక్షల టన్నులకుగాను 4.76 లక్షల టన్నుల కొండరాళ్లు సప్లై అయ్యాయి. ఉత్తరం వైపు బ్రేక్ వాటర్‌కు 1150 మీటర్లకుగాను 850 మీటర్లు, దక్షిణం బ్రేక్ వాటర్‌కు 1240 మీటర్లకుగాను 1020 మీటర్ల రాళ్లగోడల నిర్మాణాలు ఇప్పటికే పూర్తి చేశాం. గోడల నిర్మాణం పూర్తయిన అనంతరం వీటిపై సిమెంటు రోడ్డు, రెయిలింగ్ నిర్మించనున్నాము. రాళ్ల గోడకు తన్నుడుగా టెట్రాపోడ్‌లను ఏర్పాటు చేయనున్నాము. ఇరువైపులా ఉన్న రాళ్ల గోడల మధ్య ఉన్న 120 మీటర్ల మెరకను తొలగించి వేటకు వెళ్లే బోట్లు సముద్రంలోకి వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తాము.

ప్రశ్న : ఏప్రిల్‌నాటికి జరిగిన ఫిజికల్, ఫైనాన్షియల్ ప్రోగ్రెస్‌లపై మీరెలా స్పందిస్తారు?

మచిలీపట్నం ఫిషింగ్ హార్బర్ అభివద్ధికి ఐబిఎం వాల్యూ రూ.321.99 కోట్లుకాగా, 2023 ఏప్రిల్ నాటికి ఫైనాన్షియల్ ప్రోగ్రెస్ 43 శాతం ఉంది. ఫిజికల్‌గా 46 శాతం పనులు కూడా పూర్తి చేశాం. త్వరగా నిధులు విడుదలైతే పనులు మరింత వేగంగా జరిగి ఇచ్చిన టైమ్ లైనులో హార్బర్ పూర్తి చేయవచ్చు.

డివైఎఫ్ఐ పోరాటాల ఫలితంగా

జిమ్ అభివృద్ధికి రూ.15 లక్షలు మంజూరు



గతంలో స్పందనలో ఫిర్యాదు ఇస్తున్న నాయకులు



ప్రజాశక్తి-విజయవాడ : భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) చేసిన సుదీర్ఘ పోరాటాల ఫలితంగా కృష్ణలంక 22వ డివిజన్ భ్రమరాంభపురం "జిమ్" అభివృద్ధికి నగరపాలక సంస్థ రూ. 15 లక్షలు మంజూరు చేసింది. ఆనాడు విఎంసిలో కమ్యూనిస్టుల పాలకవర్గం కాలంలో భ్రమరాంభపురంలో యువకులకు వ్యాయామం కోసం అన్ని విధాలుగా అభివృద్ధి చేసి జిమ్‌ను ఏర్పాటు చేశారు. కొంత కాలం వరకు జిమ్ అన్ని విధాలుగా యువకులకు చాలా ఉపయోగకరంగా ఉంది. ఆ తరువాత కాలంలో వచ్చిన పాలకవర్గాలు ఈ జిమ్ నిర్వహణ, దాని అభివృద్ధిని పూర్తిగా విస్మరించడంతో అది కాస్త పూర్తిగా మూలనపడింది. వ్యాయామానికి ఎటు వంటి పరికరాలు లేకపోగా, నిరుపయోగంగా ఉంది. ఇటువంటి నేపథ్యంలో డివైఎఫ్ఐ స్థానిక యువకులను కలుపుకొని గత కొంత కాలం నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించింది. ప్రజాప్రతినిధులకు, అధికారులకు పలు సందర్భాల్లో వినతిపత్రాలు ఇవ్వడం, స్పందనలో కమిషనర్‌కు వినతిపత్రాలు ఇవ్వడం, సంతకాల సేకరణ, ధర్నాలు, ఆర్ఎఫ్ఒకు నాలుగు సార్లు వినతిపత్రాలు తదితర రూపాల్లో ఆందోళనలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో చేసేది లేక నగరపాలక సంస్థ అధికారులు దిగి వచ్చి జిమ్ అభివృద్ధికి రూ.15 లక్షలు మంజూరు చేసింది. దీనిపై డివైఎఫ్ఐ ఒక ప్రకటనలో హర్షం ప్రకటించింది. జిమ్ అభివృద్ధికి ఈ నిధులను వినియోగించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి కృష్ణ, ఎన్ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

చిత్తరంజన్ గ్రేడ్-2 గ్రంథాలయంలో వేసవి శిబిరం

- పోస్టర్ ఆవిష్కరించిన కార్పొరేటర్ శర్వాణిమూర్తి



ప్రజాశక్తి-విజయవాడ : స్థానిక సత్యనారాయణపురం చిత్త రంజన్ గ్రేడ్- 2 శాఖా గ్రంథాలయంలో ఈ నెల 8 నుండి జూన్ 11 వరకు వేసవి విజ్ఞాన శిబిరం (సమ్మర్ క్యాంప్) నిర్వహించనున్నట్లు 33వ డివిజన్ కార్పొరేటర్ వి.ఎన్. డి.ఎస్.ఎస్.శర్వాణిమూర్తి తెలిపారు. ఈ మేరకు కార్పొరేటర్ చేతుల మీదుగా ఆదివారం సమ్మర్ క్యాంప్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్పొరేటర్ శర్వాణిమూర్తి మాట్లాడుతూ విద్యార్థులలోని సజనాత్మ కతను వెలికితీసేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు ఎంతో దోహదపడ తాయి అన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి మధ్యా హ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ విజ్ఞాన శిబిరాలను ప్రతి విద్యార్థి ఉపయోగించు కోవాల న్నారు. విద్యార్థుల తల్లి తండ్రులు, ఉపాధ్యా యులు ప్రోత్సహించాలన్నారు. గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రతిరోజు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ అధికారి పి. సంపత్ కుమార్, రికార్డు అసిస్టెంట్ కె.కృష్ణ ప్రణీత పాల్గొన్నారు.

సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞాన్ని విజయవంతం చేద్దాం

- ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు

ప్రజాశక్తి-విజయవాడ :రాష్ట్రంలోని పేదలందరికీ సంక్షేమ పథకాల ద్వారా జీవన ప్రమాణాలను మరింత మెరుగ్గా తీర్చిదిద్ది రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఈనెల 12వ తేదీ నుండి 17వ తేదీ వరకు ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న మహా యజ్ఞం ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు ఉండకూడదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. అష్టోత్తర శత కుండాత్మక చండీ రుద్ర రాజ శ్యామల సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహా యజ్ఞం నిర్వహణ ఏర్పాట్లపై ఆదివారం జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు గూగుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతు దేవదాయ, ధర్మాదాయ శాఖ, విజయవాడ నగరపాలక సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్, రహదారులు, భవనాల శాఖ రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ అధికారులు ప్రధానంగా భక్తుల రాకపోకలకు అంతరాయం లేకుండా సమన్వయం తో పనిచేయాలన్నారు .మహాత్మా గాంధీ రోడ్డు లో గల రెండవ నంబర్ గేట్ నుండి ప్రముఖులు ఈట్ స్ట్రీట్ వైపు గల మూడవ నంబర్ గేట్ నుండి సాధారణ భక్తులు ,వాటర్ ట్యాంక్ వైపు గల గేట్ నుండి క్రతువు నిర్వహించే బ్రాహ్మణులు అధికారులు సిబ్బంది ప్రవేశించేలా మార్గాల విభజన వుంటుందన్నారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు రానున్న రాజకీయ, ఆధ్యాత్మిక ప్రముఖులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు, భక్తులకు ఇబ్బంది కలగకుండా పార్కింగ్ సదుపాయం వంటి అంశాలలో పోలీసు శాఖ పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు.

రైతులను ఆదుకోవాలి : టిడిపి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని అన్నవరం గ్రామంలో తెదేపా శ్రేణులతో కలిసి అకాల వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలను తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి శ్రీరామ్ రాజగోపాల్ తో కలిసి తెలుగుదేశం పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత పది రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయని, దీంతో రైతులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రోజుల తరబడి కురుస్తున్న భారీ వర్షాలతో పంటలు నీటిలో నాని నష్ట తీవ్రత రోజురోజుకూ పెరుగుతోందని, ధాన్యంతో పాటు మిరప, మొక్కజొన్న, మామిడి పంటలు నష్టపోయి రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారు. అకాల వర్షాలకు తడిసి రంగు మారిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి, తక్షణం రైతులను ఆదుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ కో కన్వీనర్ ముల్లంగి రామకృష్ణారెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు పాల్గొన్నారు.

మినిమం టైమ్ స్కేల్ ఎంప్లాయిస్ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలి

- రాష్ట్ర సదస్సులో సూర్యనారాయణ డిమాండ్



సదస్సులో మాట్లాడుతున్న సూర్యనారాయణ

ప్రజాశక్తి-విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వ వివిధ విభాగాలలో 1993 నవంబర్ 25 నుంచి విధులు నిర్వహిస్తూ సర్వీస్ క్రమబద్ధీకరణ జరగకుండా వారు రిటైర్మెంట్ దశకు చేరడం దురదష్టకరమని, వారి సర్వీస్ లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరణకు తగిన చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక బాలోత్సవ్ భవన్‌లో ఆదివారం జరిగిన రాష్ట్ర మినిమం టైమ్ స్కేల్ /ఫుల్ టైం- పార్ట్ టైం కంటింజెంట్ ఎంప్లాయిస్ రాష్ట్ర సంయుక్త కార్యాచరణ కమిటీ రాష్ట్ర సదస్సు బి సురేష్ అధ్యక్షతన జరిగిన సదస్సులో సూర్యనారాయణ పాల్గొని ప్రసంగించారు. గత 30 సంవత్సరాల నుండి అతి తక్కువ వేతనంతో ఉద్యోగాలు చేస్తూ... తీవ్రమైన కుటుంబ ఇబ్బందులు ఎదుర్కొంటూ ,జీవనం సాగిస్తున్న మినిమం టైం స్కేల్/ ఫుల్ టైం- పార్ట్ టైం కంటింజెంట్ ఎంప్లాయిస్ సర్వీస్‌లను రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరించకపోవడం దారుణమన్నారు. వారు రిటైర్మెంట్ స్టేజికి అతి దగ్గరలో ఉండి తీవ్ర ఇబ్బందులను గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఉద్యోగుల సర్వీస్‌లను రాష్ట్ర ప్రభుత్వం క్రమబద్ధీకరిం చడానికి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించడానికి చర్యలు చేపడతామని గత సాధారణ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత సిఎం వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీకి కట్టుబడి, దానిని అమలు జరపడానికి రాష్ట్ర ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కోరారు. గత మార్చి 24న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘ నాయకులతో రాష్ట్ర ప్రభుత్వ మంత్రివర్గ ఉప సంఘం కమిటీ, రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య అధికారులు సమక్షంలో నిర్వహించిన ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) సమావేశంలో తాను ప్రస్తావించిన మినిమం టైం స్కేల్ /ఫుల్ టైం- పార్ట్ టైం కంటింజెంట్ ఎంప్లాయిస్ సర్వీస్‌లను తక్షణమే క్రంబద్ధీకరించడానికి తగిన చర్యలు చేపట్టాలని జరిపిన చర్చల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి కె జవహర్ రెడ్డి మాట్లాడుతూ సర్వీస్ క్రమబద్ధీకరణ అంశాన్ని ప్రత్యేక అంశంగా స్వీకరించి చేపట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం కత నిశ్చయంతో ఉందని పేర్కొనడం జరిగిందని అన్నారు. ఇటువంటి నేపథ్యంలో ఉద్యోగుల సర్వీస్‌ల క్రమబద్ధీకరణకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశంలో మినిమం టైం స్కేల్ ఎంప్లాయిస్ రాష్ట్ర జేఏసీ అధ్యక్షులు బి సురేష్, రాష్ట్ర జేఏసీ ప్రధాన కార్యదర్శి కె శ్రీనివాస్ ,కోశాధికారి రవిశంకర్, రాష్ట్ర జేఏసీ ఎంప్లాయిస్ నాయకులు బెంజిమెన్, వెంకన్న, వి చంద్రశేఖర్, బి సుబ్బారావు, ఎస్ రఘునాథ్ ,వెంకటేశ్వరరావు, బి పద్మావతి పాల్గొన్నారు



టెన్త్ టాపర్లకు సత్కారం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండలం చినఅవుటపల్లి గ్రామంలో ఆదివారం సర్పంచ్ గోగులమూడి విజయలక్ష్మి దుర్గారావు అధ్యక్షతన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన గురిందగుంట రేవంత్ బాబు 570, సరిహద్దు రమణ శ్రీ 555లను ఘనంగా సత్కరించారు. కష్టపడి చదువుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు. ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సహకారం మరువలేనిది అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాజీ ఉపసర్పంచ్ సరిహద్దు ఆంథోని, మాజీ ఉప సర్పంచ్ గోగులమూడి నాగరాజు, సరిహద్దు వెంకయ్య, మావులూరి వెంకటేశ్వరరావు, వార్డు మెంబర్ పరిమి కోటేశ్వరరావు, నీలం చిన్నోడు, సరిహద్దు రాఘవేంద్రరావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అలాగే ముస్తాబాద గ్రామ జిల్లా ప్రజపరిషత్ పాఠశాల విద్యార్ధిని షేక్ ఖాజాబి పదో తరగతి పరీక్షల్లో 567 మార్కులు పాఠశాలకు మంచిపేరు ప్రఖ్యాతులు తెచ్చారని గన్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజా బెత్ రాణి అన్నారు. ముస్తాబాద గ్రామంలోని విద్యార్ధిని ఇంటికి వెళ్ళి శాలువా కప్పి స్వీట్ తినిపించి అభినందించారు. అలాగే అదే పాఠశాల లో 565 మార్కులు తెచ్చుకున్నా విద్యార్ధి మిండా పౌల్ ఇంటికి వెళ్లి శాలువా కప్పి స్వీటు తినిపించి అభినందించారు.



జయరామ విజ్ఞాన విహార విద్యార్థుల అత్యుత్తమ ప్రతిభ

ప్రజాశక్తి-గన్నవరం(ఉంగుటూరు) : ఉంగుటూరు మండలం జయరామ విజ్ఞాన విహార విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కొట్నాని.నిఖిత (566/600), అంగడాల దివ్య (547/600), బంకరు మేఘన (527/600) మార్కులు సాధించారు. మొత్తం 13 మంది విద్యార్థులు హాజరుకాగా ఆరుగురు విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు మట్ట. సావిత్రి, గుండె.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రీసాయి శ్రీనివాస విద్యార్థుల ప్రతిభ : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉంగుటూరు మండలం పెదఅవుటపల్లికి చెందిన శ్రీసాయి శ్రీనివాస హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. పదో తరగతిలో మొత్తం 30 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 29 మంది ఉత్తీర్ణతసాధించారు. పాఠశాలకు చెందిన విద్యార్థి షేక్ మీరు 564 మార్కులతో పాఠశాలలో ప్రథమస్థానం సాధించగా బి.భవ్య 560, వై.సాయిత్రిశాంక్ 555, టి.పవిత్ర 552, షేక్.తాజిదా 535 మార్కులు సాధించారు.

నేడు 'స్పందన'

ప్రజాశక్తి-విజయవాడ : ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10: 30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ యస్.ఢిల్లీ రావు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల ఉన్నతాధికారులు ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. డివిజన్, మండల స్థాయిలోనూ స్పందన కార్యక్రమం జరుగుతుందని ప్రజలు తమ అర్జీలను మండల, డివిజన్ స్థాయిలోనూ సమర్పించ వచ్చునని కలెక్టర్ ఢిల్లీ రావు అన్నారు.

పది ఫలితాల్లో 'విజేత'




ప్రజాశక్తి-భవానీపురం: పదో తరగతి పరీక్షల్లో భవానీపురంలోని విజేత హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచారని స్కూల్ కరస్పాండెంట్ యరడ్ల ఆంజనేయరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థిని అవనిగడ్డ సాయి గీతిక 582 మార్కులతో పాఠశాల ప్రథమ స్థానాన్ని, విద్యార్థి కొత్తపల్లి దీపక్ 577 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. తమ పాఠశాల నుంచి పదవ తరగతి పరీక్షలకు 64 మంది హాజరు కాగా 60 మంది ఉత్తీర్ణతతో దాదాపు 98 శాతం ఉత్తీర్ణత సాధించామని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు మంచి ఫలితాలను సాధించడం పట్ల వారిని అభినందించారు. ఉత్తమ ఫలితాలు సాధించటానికి కృషిచేసిన ఉపాధ్యాయ, ఉపాధ్యాయినిలను పాఠశాల కరస్పాండెంట్ యరడ్ల ఆంజనేయరెడ్డి ప్రశంసించారు.

విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలి

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: రెడ్డిగూడెం మండలంలో రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పర్యటించారు. శనివారం రాత్రి రంగాపురం కస్తూరిబాగాంధీ విద్యాలయంలో ఉన్న వసతులను పరిశీలించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, కాలం విలువైనదని కాబట్టి 99 మెట్లు ఎక్కినా సరే 100 వ మెట్టు ఎక్కకపోతే గోల్ రీచ్ అయినట్లు కాదని కనుక విద్యార్థులు ఫెయిల్ అయినప్పటికీ రాబోయే సప్లిమెంటరీలో విజయం సాధించాలని సూచించారు. అలాగే ఇదే కళాశాలలో మొదటి బైపీసీ విద్యార్థి దివ్యని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రఘురాం పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక మృతి

ప్రజాశక్తి-వత్సవాయి: అనుమానాస్పద స్థితిలో బాలిక మతిచెందిన సంఘటన మండలంలోని పోలంపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన తుంగ ప్రవళిక (15) శనివారం నుంచి కనిపించకపోవడంతో కుటుంబీకులు గ్రామం అంతా గాలింపు చర్యలు చేపట్టగా ఆదివారం గ్రామ శివారు బావిలో విగత జీవిగా మారి ఉండడంతో కుటుంబీకుల రోదన వర్ణనాతీతంగా మారింది. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ అభిమన్యు కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మతదేహాన్ని బావిలో నుంచి వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మతిగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ కోరుతూ ర్యాలీ

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ఇంధన వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని హెచ్‌పిసియల్ విజయవాడ రిటైల్ రీజనల్ మేనేజర్ ఆనంద్ ఆదిత్య అన్నారు. ఇంధన పొదుపు కార్యక్రమంలో భాగంగా సక్షం - 2023 అవగాహన కార్యక్రమం ఆటోనగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా అవగాహణా ర్యాలీ ఆటోనగర్‌లోని ఆరుణశ్రీ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద ప్రారంభమైంది. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఆనంద్ ఆదిత్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలన్నారు. నేడు ఇంధనాన్ని పొదుపుగా వాడటం వలన భావితరాలకు ఇంధన వనరులను అందించగలుగతామని తెలిపారు. ఈకార్యక్రమంలో యన్‌టిఆర్ జిల్లా సేల్స్ ఆఫీసర్ విష్ణువర్ధన్ రెడ్డి, హెచ్‌పిసిఎల్ చీఫ్ మేనేజర్ యన్.విల్సన్, మేనేజర్ క్వాలటీ కంట్రోల్ మాగంటి రాంబాబు, కోకో డీలర్ లక్ష్మణ్, 150 మంది హెచ్‌పిసిఎల్ రిటైల్ ఆఫీసర్లు, సీనియర్ డీలర్లు పాల్గొన్నారు.



అత్యున్నత ప్రమాణాలకు కేరాఫ్ ఇగ్నో

విజయవాడ ప్రాంతీయ కేంద్రం సహాయ సంచాలకులు సుమలత



మాట్లాడుతున్న సుమలత

ప్రజాశక్తి-వన్‌టౌన్

ప్రపంచంలోనే అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటించే విద్యాసంస్థల్లో ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ముందు వరుసులో ఉందని ఆ సంస్థ విజయవాడ ప్రాంతీయ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ కే.సుమలత అన్నారు. కేబీఎన్ కళాశాల ఇగ్నో స్టడీ సెంటర్ నూతన విద్యార్థుల ఇండక్షన్ మీటింగ్ ఆదివారం ఆ కళాశాల ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సుమలత మాట్లాడుతూ ఉన్నత విద్యారంగంలో ఇగ్నోకు ప్రత్యేక స్థానముందన్నారు. ప్రధానంగా విద్యార్థులకు వారివారి కోర్సులకు సంబంధించి సంపూర్ణ జ్ఞానం అందించే దిశగా కోర్సు రూపకల్పన ఉంటుందన్నారు. సుమారు మూడు దశాబ్దాలుగా ఇగ్నో ఉన్నత విద్యారంగ వ్యాప్తికి ఇతోధిక సేవలందిస్తుందన్నారు. ఇటీవలే యూజీసి నాక్ నుంచి ఏ డబుల్‌ప్లస్ గ్రేడ్‌ను సాధించి ప్రమాణాల విషయంలో అగ్రగామిలో ఉందని రుజువు చేసిందన్నారు. తరగతుల నిర్వహణతో పాటుగా, ప్రయోగశాలలో సాధన, ఎసైన్‌మెంట్లు తదితర రూపాల్లో బోధనా పద్ధతులు ఉంటాయన్నారు. కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో సుదీర్ఘ కాలంగా ఇగ్నో స్టడీ సెంటర్ కొనసాగుతుందని వివరించారు. ఇగ్నో విజయవాడ ప్రాంతీయ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ బీ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులకు అత్యుత్తమ ప్రమాణాలతో దూరవిద్యను అందించే సంస్థగా ఇగ్నో ఘనతికెక్కిందన్నారు. స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ ఎన్ సాంబశివరావు మాట్లాడుతూ తమ స్టడీ సెంటర్‌లో క్రమం తప్పకుండా తరగతులు కొనసాగటమే కాకుండా మంచి సదుపాయాలు ఉన్నాయని వివరించారు. సుదీర్ఘకాలంగా తమ స్టడీ సెంటర్ నుంచి ఎందరో ఉన్నత విద్యా కోర్సులను పూర్తి చేసి మంచి స్థాయిల్లో నిలిచారని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ ఎం వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డీ పవన్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'నేతాజీ' యాజమాన్యం అభినందన

ప్రజాశక్తి-భవానీపురం: పదవ తరగతి పరీక్షల్లో భవానీపురంలోని నేతాజీ హైస్కూల్ విద్యార్థులు మంచి ప్రతిభను కనబర్చి తమ హవాను చాటుకున్నారు. ఎస్‌కె సమర్ సాదియా 582 మార్కులను, ఎన్. హర్షిత 581, ఎస్.కె సమీరా 575, ఎస్.కె రహీముల్లా 567, బి.భావన 560 మార్కులను సాధించారు. ఈ సందర్భంగా నేతాజీ హైస్కూల్ యాజమాన్యం విద్యార్థులను ఘనంగా అభినందించారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కె. తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ అరుణ కుమారి పదవ తరగతి పరీక్షలలో అత్యుత్తమ ప్రతభ కనబర్చి స్కూట్ టాపర్స్‌గా నిలిచిన విద్యార్థినీ విద్యార్థులను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నేతాజీ పాఠశాల చైర్మన్ కె. తిరుపతి రెడ్డి, ప్రిన్సిపాల్ అరుణ కుమారి మాట్లాడుతూ 2023 పదవ తరగతి పరీక్షలలో తమ పాఠశాల విద్యార్థులు ఐదుగురు మంచి మార్కులు సాధించి పాఠశాలకు ఓ గుర్తింపు తీసుకువచ్చారని


విద్యార్థులను అభినందిస్తున్న తిరుపతి రెడ్డి, అరుణకుమారి

తెలిపారు. అనునిత్యం మంచి క్రమశిక్షణతో, ఉన్నత ప్రామాణాలతో విద్యను అందిస్తూ ముందుకు దూసుకు వెళు_న్నామని, తత్ఫలితమే పశ్చిమంలోని పాఠశాలల కంటే తమ నేతాజీ స్కూల్ విద్యార్థులు మంచి మార్కులు సాధించారని, ఇది తమకెంతో గర్వకారణమని పేర్కొన్నారు.

మలబార్‌లో బ్రైడల్ కలెక్షన్స్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: నగరంలోని మలబార్ గోల్డ్ అండ్ డిమాండ్ షోరూంలో బ్రైడల్ జ్యువలరీ కలెక్షన్ ఆదివారం నుండి ప్రారంభించినట్లు మలబార్ మార్కెటింగ్ మేనేజర్ గోపి తెలిపారు. ఎంజి రోడ్లోని షోరూమ్‌లో ప్రముఖ మోడల్ అంకిత రాజ్ ప్రారంభించారని తెలిపారు. వివాహ ఆభరణాలతో పాటు అన్నిరకాల ఆభరణాలు ఉన్నాయని తెలిపారు. నాణ్యతకు మలబార్ ప్రాధాన్యత ఇస్తుంది అన్నారు.



వైసిపి పాలనలో రాష్ట్రం దివాళా : పోతిన

ప్రజాశక్తి-వన్‌టౌన్: రాష్ట్రాన్ని వైసీపీ నాయకులు లూటీ చేస్తున్నారని, స్కీములన్నీ స్కాముల కోసమేనని జనసేన పార్టీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఇన్చార్జి పోతిన వెంకట మహేష్ ఘాటుగా విమర్శించారు. ఆదివారం ఇంటింటికి రాబోయే మన జనసేన ప్రభుత్వం 28వ రోజు కార్యక్రమం 38వ డివిజన్ అధ్యక్షులు తమ్మిన లీలా కరుణాకర్ ఆధ్వర్యంలో పున్నమి ఘాట్, కరకట్ట వద్ద నుండి ప్రారంభించారు. మహేష్ మాట్లాడుతూ వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఒకరికి మించి ఒకరు పోటీపడి ప్రజాధనాన్ని లూటీ చేస్తున్నారని విమర్శించారు. ప్రతి పనికి ఒక రేటు పెడుతూ అవినీతి జలగల్లా మారిపోయారన్నారు. నివాసానికి ఉపయోగం లేని భూములు కొని జగనన్న కాలనీల పేరుతో పది వేల కోట్ల రూపాయలు దోపిడీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గన్ను శంకర్, ధర రాము, శ్రీదేవి, బంగాల, కొరపురెడ్డి దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ఖ్యాతి విస్తరణకు కృషి

శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ ప్రతాప్

ప్రజాశక్తి-విజయవాడ: తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, కళలు ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించేలా నిరంతరం కషి కొనసాగిస్తామని శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్, ప్రపంచ తెలుగు సాహిత్య సాంస్కృతిక అకాడమీ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. నేటి ఆధునిక సాంకేతిక యుగంలో కూడా సాంస్కృతిక వారసత్వ సంపదను భావితరాలకు అందించేందుకు అక్షరయజ్ఞాన్ని కొనసాగిస్తామన్నారు. అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక ప్లీనరీ, ఆత్మీయ సమావేశం ఆదివారం విజయవాడలో ఘనంగా జరిగింది. స్థానిక పుస్తక ప్రదర్శన సొసైటీ ప్రాంగణంలోని వేమూరి అనిల్ స్వాతి సభా మందిరంలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సమన్వయకర్త, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి అధ్యక్షతన ప్లీనరీ వైభవంగా సాగింది. సంస్థ ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమై కార్యక్రమాలను సమీక్షించి, భవిష్యత్తు ప్రణాళికను ప్రకటించారు. నియామక పత్రాలను అందజేసి ఆత్మీయంగా సత్కరించారు. శ్రీశ్రీ కళావేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి జి. ఈశ్వరీ భూషణం ప్రత్యేక నివేదికను సభకు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టే లలిత, జాతీయ అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, జాతీయ కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు కట్ల భాగ్యలక్ష్మి, జాతీయ కార్యదర్శులు పుల్లేటికుర్తి శ్రీనుబాబు, రిషి తణుకు, ఓలేటి ఉమాసరస్వతి, ఐండ్ల సంధ్య, నూక సంపత్, జాతీయ లీగల్ సెల్ కన్వీనర్ కరుణాకర్, రాష్ట్ర శాఖ బాధ్యులు రవికుమార్, పిల్లి హజరతయ్య, లగిశెట్టి ప్రభాకర్, డా. ఎర్ర సతీష్, చంద్ర వెంకటేశ్వరరావు, ఎపి రాష్ట్ర యువజన కమిటీ అధ్యక్షుడు వడ్డె సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కత్తిమండ ప్రతాప్

అన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రి దుర్గమ్మను తెలంగాణా రాష్ట్రం వరంగల్ (పశ్చిమ) శాసనసభ్యులు డి.విజయ్‌భాస్కర్ కుటుంబ సభ్యులు ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే విజయభాస్కర్ దంపతులు అన్నదాన పథకానికి రూ.1,06,000 ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు బుద్దా రాంబాబు, చింతా సింహాచలంని కలిసి దేవస్థానానికి విరాళంగా అందజేశారు. అలాగే తెలంగాణా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.వి భాస్కర్ రెడ్డి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు.

'వి' యాప్‌తో అదనపు డేటా

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: ప్రముఖ టెలికాం ఆపరేటర్ 'వి' తన వినియోగదారుల కోసం రీచార్జిపై 5జీబీ అదనపు డేటా అవకాశం కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి రాజశేఖర్.కె. ఒక ప్రకటనలో తెలిపారు. వి యాప్ ద్వారా రీచార్జి చేయడం ద్వారా ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా అదనపు డేటాను అందిస్తూ, మహా రీచార్జి ఆఫర్లను అందిస్తున్నామని తెలిపారు. రూ.299 అంతకంటే ఎక్కువ విలువైన వి రీఛార్జిపై ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా 5జీబీ డేటా పొందేఅవకాశం ఉందన్నారు. రూ.199, రూ.299 మధ్య రీచార్జి చేయించిన వారికి ఎటువంటి అదనపు ఖర్చు లేకుండా 2జీబీ అదనపు డేటాను పొందే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవచ్చని తెలిపారు.

జైన గురువుకు సత్కారం

ప్రజాశక్తి-వన్‌టౌన్

పాతబస్తీకి చెందిన తరుణబీన్‌హన్సకుమార్‌జీ బోడోతరియా జైన సన్యాసాన్ని స్వీకరిస్తున్న సందర్భంగా శ్రీ సంభవన్యాద్ జైన్ శ్వేతాంబర్ మూర్తిపూజక్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆమెకు సత్కార కార్యక్రమాన్ని పాతబస్తీలోని మార్వాడీ గుడి వీధిలో ఉన్న ఆరాధనా భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జైన గురువు మునిరాజ్ అభినందన్‌సాగర్ విజయజీ ప్రసంగించారు. బోడోతరియాను సంఘ్ ఆధ్వర్యంలో శోభాయాత్రగా పాతబస్తీలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సంఘ్ అధికార ప్రతినిధి ప్రవీణ్ రాంకా, సంస్థ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ బోడోతరియా, ప్రధాన కార్యదర్శి పన్నాలాల్ జైన్, ఉపాధ్యక్షులు అశోక్ జైన్, జయంతిలాల్ జైన్, సహాయక కార్యదర్శి భోగిలాల్ జైన్, కోశాధికారి డుంగరమల్ జైన్, సహ కోశాధికారి రాహుల్ జైన్ పాల్గొన్నారు.